తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
హైదరాబాద్ | ఆదివారం | 15-02-2026 | సంపుటి-03 | సంచిక-250 | పేజీలు - 08 | వెల:3/–

ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది

అక్షరగళం, వేములవాడ,ఫిబ్రవరి14:

తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు పరమశివుడు. భక్తితో ఓ సుమం



సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతికరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి.

శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పుష్పపల్లకిపై దర్శనమిచ్చిన మల్లికార్జునుడు

అక్షరగళం, శ్రీశైలం,ఫిబ్రవరి14:

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవారు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవారికి అర్చకులు వేదపండితులు ఆలయ చైర్మన్, సభ్యులు,ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించి హారతులిచ్చారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైలం పురవీధులలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవానికి తరలుతుండగా... ఉత్సవం ముందు కోలాటాలు డమరక నాధాలతో పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట పలు రకాల పుష్పాలతో దేదీప్యమానంగా

తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ నజర్

కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
మంత్రులు, పార్టీ నేతలతో సీఎం రేవంత్ సమీక్ష
ఆయారామ్ గయారామ్ ల హడావిడి
సీఎం రేవంత్ తో భేటీ అయిన వడ్డేపట్టి కౌన్సిలర్లు

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి14:

మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరవాత సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మరోవైపు చైర్మన్లు, వైఎస్ చైర్మన్ల ఎంన్నికపై అనుసరించాల్సిన వ్యూహంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు..తదుపరి కార్యాచరణపై చర్చించారని సమాచారం.

మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు
మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

అక్షరగళం, సిద్దిపేట,ఫిబ్రవరి14:

మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు

మిగతా 2లో

కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత

చక్రం తిప్పిన పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

అక్షరగళం, నిజామాబాద్,ఫిబ్రవరి14:

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సొంత మండలం భీంగల్‌లో చక్రం తిప్పారు. రెండు రోజుల ముందు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీంతో ప్రజాపాలనకు జనం జైకొట్టారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీని సవాల్‌గా తీసుకున్నా సక్సెస్ కాలేకపోయారు. బీఆరఎస్ నాలుగు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరేయడానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డినా 8 చోట్ల మాత్రమే గెలుపు సాధించగలిగారు. 19 స్థానాలు దక్కించుకొని కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ సొంతం చేసుకుంది. రెబెల్స్ పోటీలో లేకుంటే మరో మూడు

మిగతా 2లో

16న ఏపీకి వస్తున్న బిల్‌గేట్స్

మూడుసార్లు ఏపీకి రప్పించిన ఘనత నాదే
సంజీవిని పథకం వస్తున్నారని వెల్లడించిన చంద్రబాబు

అక్షరగళం, అమరావతి,ఫిబ్రవరి14:

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ 16న సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. 'ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే' అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం

మిగతా 2లో

లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి

02

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

నైతిక విజయం తమదే అన్న వేముల

అక్షరగళం, నిజామాబాద్,ఫిబ్రవరి14:

మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆరఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు

మిగతా 4లో

మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి14:

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆరఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్సఅఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో

మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆరఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన

మిగతా 2లో

అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి14:

నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్ నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన

మిగతా 4లో

కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు
కేంద్రమంత్రి బండి సంజయ్

అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి14:

అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆరఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని

మిగతా 2లో

బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు తెర

04

తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బీఆర్ఎస్
సిపిఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం
మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత

రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం

ఢిల్లీ`అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు

02

అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు

రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు
రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు
మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా
రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు
విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు
రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు
ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు
జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు

మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు
అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు
పోలవరం రూ.6,105 కోట్లు కేటాయింపు
విభజన సమస్యలతో పాటు, గత ఐదేళ్ల నష్టాలను అధిగమించేలా ముందుచూపు
బడ్జెట్ అంటే కేవలం లెక్కలు మాత్రమే కాదు
బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

02

కామారెడ్డిలో హంగ్‌తో అస్పష్టత

(మొదటిపేజీ తరువాత)

వార్డులు కాంగ్రెస్ కు దక్కేవి. బీఆరఎస్ 5 స్థానాలు, మజ్లిస్ ఒక చోట గెలువగా ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన ముగ్గురు రెబెల్స్ విజయం సాధించారు. 38 వార్డులున్న బోధన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 17 వార్డులు కైవసం చేసుకుంది. రెబెల్‌స్‌తో కొన్ని వార్డుల్లో పార్టీకి నష్టం వాటిల్లింది. మజ్లిస్ గత వైభవాన్ని చాటుతూ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 3 వార్డులకే పరిమితమైంది. బీఆర్?ఎస్? ఐదు వార్డులు గెలువగా కాంగ్రెస్ రెబెల్ ఒకచోట విజయం సాధించారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్‌కుంద మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. బాన్సువాడలో 19 వార్డులకుగాను 11 , ఎల్లారెడ్డి వార్డులకు 10, బిచ్‌కుందలో 12 వార్డులకు 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్ చేరుకునేందుకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఆయా పార్టీలకు ఇండిపెండెంట్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం కానున్నారు.

కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే

(మొదటిపేజీ తరువాత)

కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజెక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆరఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయటపెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆరఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆరఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

(మొదటిపేజీ తరువాత)

పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. పార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా`ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.



శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

సర్వాంగ సుందరంగా తయారుచేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులను కనువిందు చేశారు గంగాధర మండపం దగ్గర పుష్పపల్లకిలో ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక హారతులిచ్చి అనంతరం అంకాలమ్మ గుడి,నంది మండపం బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు పుష్పపల్లకిపై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు శ్రీశైల క్షేత్రమంత శివనామస్మరణతో మారుమ్రోగింది.

రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్`నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా`మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ`అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి`హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్`పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా` బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి`ట్రిమ్బక్ `పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు

అమరావతి,ఫిబ్రవరి14:

2026`27కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ అసెంబ్లీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. వరుసగా మూడోసారి ఆయన బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్.. రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. 2026`27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన పయ్యావుల.. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లగా అంచనా వేశారు. అయితే, రాష్ట్ర రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2025`26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లుకు చేరింది. 2026`27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు ఉంది. 2025`26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 80,567.47 కోట్ల ద్రవ్య లోటుగా నమోదు అయింది. ఇక, 2026`27బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2026`27 వార్షిక బ్జడెట్: రూ.3,32,205 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు,మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు,ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లుగా చూపారు. ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, 'వీబీ జీ రామ్ జీ'కి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు నిధి రూ.1,500 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు పరిశీలిస్తే ...ఎన్టీఆర్ భరోసా `రూ.27,719 కోట్లు,దీపం 2.0 `రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు `రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి `రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ `రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో `రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు రూ.3,836 కోట్లు ,మధ్య శిక్ష రూ.2,946 కోట్లు, ఉన్నత విద్య రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం`రూ.2,161 కోట్లు ,మనబడి మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి కిరూ.1,232 కోట్లు,పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు రూ.654 కోట్లు, యువత, క్రీడలు రూ.438 కోట్లు కేటాయించారు. శాఖల వారిగా బ్జడెట్ కేటాయింపులు పరిశీలిస్తే... వ్యవసాయ అనుబంధ రంగాలు `రూ.13,598 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ `రూ.22,942 కోట్లు, మున్సిపల్ శాఖ `రూ.14,539 కోట్లు, జలవనరుల శాఖ `రూ.18, 224 కోట్లు, పాఠశాల విద్యాశాఖ `రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ `రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ `రూ.11,118 కోట్లు, కార్మిక శాఖ `రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ `రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ `రూ.9,856 కోట్లు, హోం శాఖ `రూ.9,165 కోట్లు కేటాయించారు. ఇక ఇతర కేటాయింపులు పరిశీలిస్తే ..పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలు, కొత్త పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాలు,ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు,జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు ,స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు,విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు,రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు, కేటాయించారు. వరుసగా మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తన అదృష్టమని అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్ రూపొందించినట్లు తెలిపారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేది బడ్జెట్ అన్నారు. కుటుంబాన్ని నడిపిస్తున్న గృహిణికి భరోసా ఇచ్చేది బడ్జెట్ అని చెప్పుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలో పరుగులు పెట్టించాలనే సంకల్పం తమది అని స్పష్టం చేశారు. బ్రాండ్ చంద్రబాబు వల్లే స్వర్ణాంధ్ర సాకారమన్నారు ఆర్థిక మంత్రి . గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకుంది బాహుబలి ఒప్పందమని తెలిపారు. రైతుల కలలను నెరవేర్చేలా, యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందన్నారు. పాలన ఎలా చేయకూడదో అనేది గత ప్రభుత్వ రాష్ట్రానికి చేసిన నష్టాన్ని చూస్తే అర్థమవుతుందని తెలిపారు . గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దేలా 2024లో బడ్జెట్ ప్రవేశపెడితే... స్వర్ణాంధ్ర విజన్`2047కు బాటలు వేస్తూ 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక విధ్వంసం ఎదుర్కొన్న రాష్ట్రాన్ని సరిదిద్దడానికి రెండేళ్ల సమయం ఎంత మాత్రమూ సరిపోదని మంత్రి చెప్పారు. రాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు... గత ప్రభుత్వ పాలన కూడా తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు మంత్రి. చాలా సవాళ్లు ఉన్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి జరిగిందని చెప్పడానికి గర్వపడుతున్నానని అన్నారు. ఇప్పటి వరకు ఏం సాధించాం... ఇంకా ఏం సాధించాలనే అంశాల ఆధారంగా బ్జడెట్ రూపొందించామని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దామన్నారు. కాగితాలకే పరిమితం కాకుండా... క్షేత్ర స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేయడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

హైదరాబాద్,ఫిబ్రవరి14: తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవంత చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

రంగారెడ్డి,ఫిబ్రవరి14: మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు. చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు

(మొదటిపేజీ తరువాత)

మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆరఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు.తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయిందని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్‌రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

(మొదటిపేజీ తరువాత)

ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు. ఇకపోతే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు నచ్చిన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆరఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట పదో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. నారాయణపేటలో మొత్తం 24 స్థానాలకు భాజపా 11 స్థానాలు గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి చేరికతో భాజపా సభ్యుల సంఖ్య 12కి చేరింది. దీంతో నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో ఓటు కీలకం కానుంది. ఇప్పటికే బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ కేటీఆర్ సమక్షంలో బీఆరఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 14, బీఆరఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం దక్కాయి. దీంతో ఆ పార్టీ బలం 17కు చేరింది. ఈ నెల 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు చెప్పారు. తెలంగాణ జాగృతి పార్వర్డ్ బ్లాక్ ద్వారా పోటీ చేసింది. అయితే అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

16న ఏపీకి వస్తున్న బిల్‌గేట్స్

పిలిపిస్తున్నామని వివరించారు. ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ'గా మార్చడం, ప్రతి పౌరుడికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ హెల్త్ రికార్డులు: సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొల్/ డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రి

మహా శివరాత్రి విశిష్టత.. ఎలాంటి నియమాలు ఆచరించాలి?

ఈ సకల చరాచర జగత్తుకు లయకారకుడు ఆ పరమేశ్వరుడు. భక్తుల పాలిట పెన్నిధి, భోళా శంకరుడైన ఆ త్రినేత్రుడు లింగోద్భవం చెందిన పవిత్ర దినమే మహా శివరాత్రి మనసా వాచా ఆ పరమేశ్వరుడిని స్మరిస్తూ.. జాగరణలో దైవ సన్నిధిని అనుభూతి చెందడమే ఈ పండగ పరమార్థం. శివయ్యకు భక్తులంటే ప్రీతి. భక్తులకు శివుడంటే నమ్మకం. అందుకే 'హరహర మహాదేవ' అంటూ భక్తులు రోజూ స్తుతిస్తూ నిత్య శివరాత్రి జరుపుకొంటారు. ఆ లయకారుడిని ఎన్నిసార్లు స్తుతించినా తనివితీరదంటూ ప్రతి మాసానికీ ఒక్కో శివరాత్రి పేరుతో ఆరాధిస్తుంటారు.

వీటన్నింటిలో అత్యంత విశిష్టమైనదిగా భావించే ఈ మహా శివరాత్రి (ఫిబ్రవరి 15) ప్రత్యేకత ఏమిటి? ఈ పర్వదినాన ఏ నియమాలు ఆచరిస్తే, ఎలాంటి పుణ్యఫలం దక్కుతుందనే విషయాలను ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, పంచాంగకర్త, బ్రహ్మశ్రీ చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ వివరించారు.

ఆదివారం రోజున మహా శివరాత్రి రావడం ఎంతో విశేషం. అఘము అంటే పాపం, మాఘం అంటే పాపాలను నశింపజేసేదని అర్థం. అలాంటి మాఘ మాసంలో సూర్యారాధన ఎంతో విశేషమైనది. సూర్యసంబంధిత ఆదివారం రోజు, మాఘ మాసంలో మహా శివరాత్రి రావడం విశేషం. సూర్యుడికి రుద్రుడు అధిదేవత అనీ, అలాంటి మాఘపు ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా సూర్యారాధన, శివారాధన కలిపి ఆచరించడం వల్ల పాపాలు తొలగుతాయని విశ్వాసం.

ఏ నియమాలు ఆచరించాలి?

మహా శివరాత్రి అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు.. అది ఆత్మజాగరణకు దారి చూపే పవిత్రమైన రోజు. ఈ రోజు మనిషి బాహ్య ప్రపంచాన్ని విడిచి తన అంతరంగంలో ఉన్న శివతత్త్వాన్ని గ్రహించాలి. భక్తులు ఉపవాసం, జాగరణ, శివనామస్మరణ చేయాలి. సాగర మథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని శివుడు సేవించిన రోజు కూడా ఇదే. అందుకే ఆయన నీలకంఠుడు అయ్యాడు. పరమశివుడు జ్యోతిర్లింగంగా ఆవిర్భవించిన పవిత్ర ఘట్టమైన లింగోద్భవమూ ఈరోజే. హిమవంతుడికి కుమార్తె పార్వతీదేవిని శివుడు వివాహం చేసుకున్న గొప్ప రోజు కూడా ఇదే. అందుకే అత్యంత పవిత్రమైన ఈ మహా శివరాత్రి వేళ సూర్యోదయానికి ముందే నిద్రలేచి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతిఒక్కరూ తలస్నానం ఆచరించాలి. శివాలయాన్ని సందర్శించాలి. ఉపవాసాన్ని సంకల్పించుకోవాలి.

ఉపవాసం అంటే ఉప +ఆవాసం. అంటే శివనామస్మరణతో శివుడికి దగ్గరగా ఉండటం. మీలో అంతఃశక్తిని జాగృతం చేయడం. అంతేగానీ, అన్నం మానేయడం, సినిమాలు చూస్తూ, ఆఫీస్ పనులు చేస్తూ, పాటలకు డ్యాన్సులు చేస్తూ మెలకువగా ఉండటం జాగరణ అనిపించుకోదు.

శివరాత్రి రోజు ఉదయం, ప్రదోష కాలంలో, రాత్రి సమయంలో మరీ ముఖ్యంగా అర్ధరాత్రి లింగోద్భవ కాలం (అర్ధరాత్రి 11.30 గంటల నుంచి 12.30 గంటల మధ్య కాలం) శివారాధన చేయాలి.

విష్ణుహ అలంకార ప్రియః శివః అభిషేక ప్రియః అని శాస్త్రం. శివరాత్రి రోజు ఇంట్లో కుడిచేతి బొటనవేలిని మించకుండా ఉన్న శివలింగానికి (బాణలింగం, స్ఫటికలింగం, మీరు పూజిస్తున్నటువంటి పంచలోహాలు, ఇతర శివలింగాలను స్థాపన చేసుకొని) పంచామృతాలు, చందనం, విభూతి జలములతో అభిషేకం వంటివి చేయాలి. బిల్వ దళాలతో అర్చించాలి.

దోష నివారణలు ఫలితాలు

ఆదివారం మహాశివరాత్రి రావడం వల్ల ఈరోజు శివారాధన చేసినవారికి అనారోగ్య సమస్యలు తొలగుతాయి. పితృదేవతలు తరిస్తారు. శివారాధన వల్ల ఆరోగ్యం, ఆయుష్షు, యశస్సు, కీర్తి, విజయాలు దక్కుతాయి. నవగ్రహాలకు నాయకుడైనటువంటి రవి సంబంధం ఉండటంతో సూర్యారాధన, శివారాధన చేసిన వారికి శత్రుపీడ, గ్రహ బాధలు తొలగి శుభాలు కలుగుతాయి. ఈ శివరాత్రి రోజున ఉపవాసం, జాగరణ, ఓం నమఃశివాయ మంత్ర జపం, రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు దానం వంటివి చేస్తే పాపాలు తొలగి ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతాన సౌఖ్యం, మానసిక ప్రశాంతత, మోక్ష ప్రాప్తి కలుగుతాయి.సర్వ దినాల యందు శివారాధన చాలా విశేషమైనది సనాతన సంప్రదాయంలో ఈశ్వరునికి ఉన్న ప్రాధాన్యత చాలా ప్రత్యేకమైనది.

వంకాయ వంటి కూరయు
పంకజముఖి సీత వంటి భార్యామణియున్
శంకరుని వంటి దైవము
లంకాధిపు వైరి వంటి రాజును గలరే?

వంకాయ వంటి రుచికరమైన కూర, స్త్రీలలో సీతమ్మ వంటి పతివ్రతామణి, దేవుళ్లలో శంకరుడు (శివుడు), రాజులలో లంకాధిపు వైరి (రావణుని శత్రువైన రాముడు) వంటి రాజు వీరందరూ ఎంతో శ్రేష్ఠులు, వారికి సాటి ఎవరూ లేరు. శివారాధన వలన తాపత్రయ నివృత్తి జరగడమే గాక మోక్ష సామ్రాజ్యసిద్ధి కలుగుతుందని శ్రుతి స్మృతి పురాణ వచనం, 'ఐశ్వర్యం ఈశ్వరాదిచ్ఛేత్' అష్ట విభూతులను సమస్త సంపదలను పరిపూర్ణంగా అందించే పూర్ణ దైవం మహాదేవుడు.

అలాంటి శుభంకరుడైన శంకరుడు లింగ రూపంగా ఆవిర్భవించి భక్త కోటిని అనుగ్రహించిన పరమ పుణ్య పవిత్ర దినమే మహాశివరాత్రి.విధి విధాన పురస్సరంగా శ్రద్ధా భక్తులతో పరమేశ్వరుడిని ఆరాధించినా జన్మ చరితార్థం అవుతుంది అందుకే 'జన్మకో శివరాత్రి' అంటారు అటువంటి పవిత్ర శివరాత్రి నాడు రేజంతా శివారాధన శివనామస్మరణ చేయడం వల్ల పరిపూర్ణమైన శివానుగ్రహం కలుగుతుంది. మహాశివరాత్రి నాడు విశేషమైన సమయంగా లింగోద్భవ కాలాన్ని చెబుతారు. ఈ సమయం అర్ధరాత్రి వేళ కొంచెం అటు ఇటుగా ఒక్కొక్క సంవత్సరం ఒక్కోలా వస్తుంది. ఈ సంవత్సరం ఈ లింగోద్భవ కాలం రాత్రి 12 గంటల 03 నిమిషాల 10 సెకన్ల నుంచి 12 గంటల 53 నిమిషాల 52 సెకన్ల వరకు ఉంది. ఈ పరమ పవిత్రమైన సమయంలో లింగ రూపంలో ఉన్న పరమేశ్వరునికి అభిషేకం జరిపించడం ఎంతో ఉత్కృష్టమైనదని శివ మహాపురాణం శివ రహస్యాది గ్రంథాలు చెబుతున్నాయి. కారణాంతరములతో ఈ విధంగా ఆచరించలేని వారు యథాశక్తిగా పంచాక్షరి మంత్ర జపం చేసిన పంచభూతాత్మకుడైన పరమేశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. మహాశివరాత్రి నాడు శివారాధన శివనామస్మరణతో పాటు

ఫాలే త్రిపుండ్రం యస్య
గళే రుద్రాక్ష మాలికా |
వక్త్రే షడక్షరీ స్తోత్రం
సరుద్రో నాఽత్ర సంశయః||

మహా శివరాత్రి నాడు నుదుట విభూతి రేఖలను ధరించి, కంఠ మాలగా రుద్రాక్షలను ధరించి, నాలుకకు తగిన పంచాక్షరీ మంత్రమని మణిదీపాన్ని వెలిగించి నిరంతరం శివనామ స్మరణ చేసిన వారు సాక్షాత్తూ పరమేశ్వరుని వంటి స్థితిని పొందుతారు అని శాస్త్ర వచనం.

అక్రెడిటేషన్లకు సర్క్యులేషన్ లింకా!



ఒకే స్కూల్లో, ఒకే తరగతి గదిలో, ఒకే బెంచ్ మీద కూర్చొని చదువుకొంటున్న విద్యార్థుల్లో కొందరికి 'స్టూడెంట్ ఐడీ కార్డులు' జారీ చేసి, పుస్తకాలు, పెన్నులు, బస్‌పాస్‌లు ఇచ్చి, మరికొందరికి అవేవీ ఇవ్వకపోతే.. దాన్ని ఏమంటాం? సింపుల్‌గా వివక్ష! ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల కూడా అక్షరాలా ఇదే రకమైన వివక్ష ప్రదర్శిస్తున్నది. ఒకే ఆఫీసులో, ఒకే చోట, పక్కపక్కనే కూర్చొని ఒకేర కమైన విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టుల్లో కొందరికి మాత్రమే అక్రెడిటేషన్ కార్డులు ఇస్తామంటూ ఒక్కో మీడియా సంస్థకు ఒక్కో రకమైన కోటా నిర్ణయించింది.

ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు సుదీర్ఘ పోరాటం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మునుపెన్నడూ, మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా దాదాపు 23 వేల అక్రెడిటేషన్లు జారీ అయ్యాయి. అయితే, వీటి కాల పరిమితి ముగియడంతో జర్నలిస్టుల కథ మళ్లీ మొదటికి వచ్చింది. అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇస్తామని, 44 వేల కంటే ఎక్కువమందికి మంజూరు చేస్తామని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్తున్నప్పటికీ, అదే శాఖ కమిషనర్ జారీ చేస్తున్న జీవోలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. తొలుత జారీ చేసిన జీవో252, ఆ తర్వాత ఇచ్చిన సవరణ జీవో103 ప్రకారం...

చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాదాపు అన్ని మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల్లో సగం మందికి కూడా అక్రెడిటేషన్ కార్డులు దక్కే అవకాశం కనిపించడం లేదు. అక్రెడిటేషన్ అనేది 'ఇతను జర్నలిస్టు' అని గుర్తిస్తూ ప్రభుత్వం జారీ చేసే ఒక ఐడెంటిటీ కార్డు. ఇందుకు కనీసం డిగ్రీ ఉత్తీర్ణత, ఐదేండ్ల సర్వీసును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అక్రెడిటేషన్ కార్డు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో, కేంద్ర ప్రభుత్వం రైల్వే చార్జీల్లో రాయితీలు ఇస్తుంటాయి.

అయితే, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కరోనా సమయంలో రైల్వే చార్జీల్లో రాయితీలను ఎత్తివేసింది. వాటిని పునరుద్ధరించలేదు. ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవల నిమిత్తం అందజేస్తున్న ఈజేహెచ్ఎస్ హెల్త్ కార్డులను కూడా అక్రెడిటేషన్ ఆధారంగానే మంజూరు చేస్తున్నారు. అవి కూడా ప్రభుత్వ దవాఖానల్లో తప్ప ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో పనిచేయడం లేదు. అక్రెడిటేషన్ ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాల మీద ప్రెస్ అని రాసుకోవాలని ఇటీవల సమాచార శాఖ మెమో జారీ చేసింది. ఒకవైపు, అక్రెడిటేషన్ కార్డులకు, జర్నలిస్టుల సంక్షేమ పథకాలకు సంబంధం ఉండదని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంటున్నదనేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు అనే తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చింది. కానీ, నూతన అక్రెడిటేషన్ పాలసీ పేరిట గత డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో252లో అక్రెడిటేషన్ కార్డులు, మీడియా కార్డుల పేరిట రెండు రకాల కార్డులు ఇస్తామంటూ జర్నలిస్టుల మధ్య విభజన రేఖ గీసింది. వివిధ మీడియా సంస్థలకు ఇచ్చే కార్డుల సంఖ్య విషయంలోనూ అనేక పరిమితులు విధించింది. దీనిపై జర్నలిస్ట్ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో జీవో252లో పేర్కొన్న 'మీడియా కార్డు' అనే పదాన్ని 'అక్రెడిటేషన్ కార్డు'గానే పరిగణిస్తూ సవరణ జీవో103 పేరిట విడుదలైంది. అయితే, వివిధ మీడియా సంస్థలకు ఇవ్వజూపిన కార్డుల సంఖ్యపై పరిమితులు తొలగించలేదు. గతంలో మాదిరిగానే అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.

ఈ జీవోల ప్రకారం.. పత్రికల సర్క్యులేషన్ ప్రాతిపదికగా వాటిని పలు క్యాటగిరీలుగా విభజించి, ప్రతి మీడియా సంస్థకూ పరిమిత సంఖ్యలోనే అక్రెడిటేషన్లు జారీ చేయనున్నారు. జనరల్ క్యాటగిరీలో (పత్రిక ప్రధాన ఆఫీసులో పనిచేసే స్టేట్ బ్యూరో, సెంట్రల్ డెస్క్, ఇతర స్పెషల్ డెస్క్‌లు, ఫొటోగ్రాఫర్లు, కలిపి) 2.5 లక్షలకు మించి సర్క్యులేషన్ ఉన్న పత్రికల నుంచి రిపోర్టర్లకు 12, డెస్క్ జర్నలిస్టులకు 12, ఫొటోగ్రాఫర్లకు రెండు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నారు. 75 వేల నుంచి 2.5 లక్షల లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికల నుంచి రిపోర్టర్లకు 8, డెస్క్ జర్నలిస్టులకు 8, ఫొటో గ్రాఫర్‌కు ఒకటి ఇస్తారు. 25 వేల నుంచి 75 వేల లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికల విషయంలో రిపోర్టర్లకు 6, డెస్క్ జర్నలిస్టులకు 6, ఫొటోగ్రాఫర్‌కు ఒకటి ఇవ్వనున్నారు.

జిల్లాల్లో పనిచేసే డెస్క్ జర్నలిస్టులతోపాటు కార్టూనిస్ట్‌లకూ కోటా ఇవ్వలేదు.శాటిలైట్ చానల్స్‌కు సంబంధించి హైదరాబాద్ కేంద్రంలో పనిచేసే రిపోర్టర్లకు 8, డెస్క్ జర్నలిస్టులకు 8, కెమెరామెన్‌కు 8 కార్డుల చొప్పున ఇస్తారు. వాస్తవానికి ఆయా పత్రికలు, శాటిలైట్ చానల్స్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్ సంఖ్యతో పోల్చుకుంటే ఇవి సగం కూడా ఉండవు. మరి మిగిలినవారి పరిస్థితి ఏమి టి? ఈ విధానం ప్రకారం.. ఎన్నో ఏండ్లుగా వివిధ సంస్థల్లో జర్నలిస్టులుగా పనిచేస్తూ, ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డులు కలిగిన చాలామంది జర్నలిస్టులు కూడా తమ గుర్తింపు కార్డులను కోల్పోవాల్సి వస్తుంది. అక్రెడిటేషన్‌తోపాటు తమకు ఎంతో కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తున్న బస్‌పాస్‌లు, హెల్త్‌కార్డులు కూడా కోల్పోక తప్పదన్న ఆందోళన జర్నలిస్టుల్లో వ్యక్తమవుతున్నది.

నిజానికి, అడ్వర్టయిజ్‌మెంట్ల టారిఫ్‌కు ఉద్దేశించిన సర్క్యులేషన్ ప్రమాణాలను జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు వర్తింపజేయడం అర్థరహితం. ప్రభుత్వానికి ఎవరు సలహాలు ఇస్తున్నారో కానీ, వారికి ప్రస్తుతం మీడియా రంగం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితుల గురించి కానీ, జర్నలిస్టుల సమస్యల మీద కానీ ఏమాత్రం అవగాహన ఉన్నట్టు లేదు. అసలు.. సర్క్యులేషన్‌కూ, అక్రెడిటేషన్ కార్డులకూ ముడిపెట్టడం ఏమిటి? జర్నలిస్టును జర్నలిస్టుగా గుర్తించడానికి పరిమితులు విధించడం ఏమిటి?

నిజానికి పత్రిక 'సర్క్యులేషన్' అనేది జర్నలిస్టులకు సంబంధించిన వ్యవహారం కాదు. 'సర్క్యులేషన్' పెంచడమనేది వారి డ్యూటీ కాదు. వార్తల సేకరణ, జర్నలిజం ప్రమాణాలకు అనుగుణంగా వాటిని తీర్చిదిద్దడం, అందరికీ అర్థమయ్యేలా వాటిని ప్రజెంట్ చేయడమే పత్రికలు, న్యూస్ చానళ్లలో వారి విధి. 'సర్క్యులేషన్' పెంచుకోవడం, తగ్గించుకోవడం అనేది పూర్తిగా యాజమాన్యాల ఆర్థిక స్థోమతకు సంబంధించిన వ్యవహారం. తమ సంస్థకు అందుబాటులో ఉన్న నిధులు, ఆదాయ, వ్యయాలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యాలు నిర్ణయాలు తీసుకొంటాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా సంస్థల నిర్వహణ పెను భారంగా మారుతున్నది. ముఖ్యంగా కరోనా తర్వాత మీడియా రంగం స్వరూపంలో గణనీయమైన మార్పు వచ్చింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఒడిదొడుకులను ఎదుర్కొంటుండగా, డిజిటల్ మీడియా విస్తృతమవుతున్నది. మరోవైపు న్యూస్ ప్రింట్‌తోపాటు ఇతర ముద్రణా ఖర్చులు, రవాణా వ్యయాలు విపరీతంగా పెరగడం, అందుకు తగ్గట్టుగా యాడ్ రెవెన్యూ లేకపోవడంతో పత్రిక నిర్వహణ పెను సవాల్‌గా మారుతున్నది. ఈ నేపథ్యంలో డిమాండ్ ఉన్నప్పటికీ, సర్క్యులేషన్ పెంచుకునేందుకు పత్రికా యాజమాన్యాలు సాహసించలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నది.

అయినప్పటికీ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొని రావడంలోనూ, వివిధ ప్రభుత్వ పథకాలకు ప్రాచుర్యం కల్పించడంలోనూ, వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై విశ్లేషణలు అందించడంలోనూ, రానున్న ఉపద్రవాలపై సమాజాన్ని జాగృతం చేయడంలోనూ పెద్ద, చిన్న అనే తేడా లేకుండా అన్నీ మీడియా సంస్థలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఆయా మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రదర్శిస్తున్న నిబద్ధత, వృత్తి పట్ల ఉన్న అంకితభావమే ఇందుకు కారణం. ఆయా కథనాలు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా వేగంగా షేర్ అవుతూ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తూ, సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

విధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పాలకులు ఈ విషయాన్ని విస్మరించకూడదు. ప్రభుత్వం ఎటువంటి భేషజాలకు పోకుండా అక్రెడిటేషన్ విధానాన్ని మరోసారి పునఃసమీక్షించుకోవాలి. ఎవరు ఏ సంస్థలో పనిచేస్తున్నారనే అంశాన్ని కాకుండా వృత్తి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిగణనలోకి తీసుకొని సహేతుకమైన విధానం రూపొందించాలి. జర్నలిజంలో ఉన్న అనుభవం, నిర్దేశిత విద్యార్హతలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ జారీ చేస్తేనే అది సమన్యాయం అనిపించుకుంటుంది. అంతే తప్ప జర్నలిస్టులకు సంబంధం లేని అంశాలను నిబంధనల్లో రూపొందించి, అక్రెడిటేషన్ కార్డుల సంఖ్యను కుదించడమంటే 'మీడియా స్వేచ్ఛ' మీద పరోక్షంగా సెన్సార్ విధించడమే అవుతుంది.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొని రావడంలోనూ, వివిధ ప్రభుత్వ పథకాలకు ప్రాచుర్యం కల్పించడంలోనూ, వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై విశ్లేషణలు అందించడంలోనూ, రానున్న ఉపద్రవాలపై సమాజాన్ని జాగృతం చేయడంలోనూ పెద్ద, చిన్న అనే తేడా లేకుండా అన్నీ మీడియా సంస్థలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఆయా మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులు ప్రదర్శిస్తున్న నిబద్ధత, వృత్తి పట్ల ఉన్న అంకితభావమే ఇందుకు కారణం.

చారిత్రక సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాలరాస్తారా?

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు. హుసేన్‌సాగర్ కట్ట ఈ రెండు నగరాలను వేరుచేస్తున్నది. కవాడిగూడ ప్రాంతంలో రోడ్డుకు ఒకవైపు సికింద్రాబాద్ అయితే రెండవ వైపు హైదరాబాద్. ఈ రెండు నగరాలను వేరుచేసేది, కలిపేది ఒక రోడ్డే. కానీ రెండు ప్రాంతాల మధ్య చాలా తేడా ఉంటుంది. సికింద్రాబాద్ ప్రశాంతమైన నది అయితే హైదరాబాద్ రణగొణ ధ్వనులతో హడావుడిగా ఉంటుంది. ఒకప్పుడు సికింద్రాబాద్‌ను లిటిల్ ఇంగ్లాండ్ అని పిలిచేవారు. సికింద్రాబాద్ నగరం 1806లో ఏర్పడింది. 2006లో పాలకులు సికింద్రాబాద్ 200 సంవత్సరాల ఉత్సవాలను నిర్వహించారు. సికింద్రాబాద్ ప్రత్యేకతను నిలబెడతామని అప్పుడు బోలెడు హామీలు ఇచ్చారు. ఏకంగా ఇప్పుడు సికింద్రాబాద్ అస్తిత్వాన్నే మాయం చేస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్‌లుగా విభజిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలు, చారిత్రక ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని ఈ విభజన జరిగి ఉంటే బాగుండేది. కానీ రాజకీయ గురువు మీద అభిమానం, ఒక ప్రాంతం పట్ల నిర్లక్ష్యం మాత్రమే కనిపిస్తున్నది. సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ కార్పొరేషన్‌లుగా మూడు కార్పొరేషన్‌లు చేస్తున్నారు. నిజాం ప్రభుత్వ హయాంలోనే సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉంటే అప్పుడు మల్కాజ్‌గిరి ఒక గ్రామ పంచాయతీ. సాధారణంగా గ్రామ పంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తారు. కానీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను పంచాయతీలో విలీనం చేయరు. కనీస పరిజ్ఞానం ఉన్నవారెవరూ ఇలా చేయరు.

సికింద్రాబాద్ ప్రాంతంలో తొలుత ఉళ్వల్ అనే గ్రామం ఇప్పటి అల్వాల్‌కు సమీపంలో ఉండేది. హుసేన్‌సాగర్‌కు ఉత్తర భాగంలో ఉండే ఈ ప్రాంతాన్ని నిజాం ఇచ్చారు. 1798లో నిజాం అసఫ్ జా 2 బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హైదరాబాద్ శివారులో బ్రిటిష్ సైన్యం శిబిరాలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ ప్రాంతాన్ని ఇచ్చారు.

1803లో మూడవ నిజాం సికందర్ జా తన పేరు మీదుగా ఈ ప్రాంతానికి సికిందరాబాద్ అని పేరు పెట్టారు. 1806లో అధికారికంగా బ్రిటిష్ కంటోన్మెంట్‌గా ఏర్పడింది. సికింద్రాబాద్‌ను పాతతరం వారు ఇప్పటికీ లష్కర్ అనే పిలుస్తారు. అప్పట్లో ఈ ప్రాంతానికి లష్కర్ అనే పేరు ఎక్కువగా వాడుకలో ఉండేది.

లష్కర్ అంటే సైన్య శిబిరం అని అర్థం. కాలక్రమేణా లష్కర్ అనే పేరు వాడుకలో లేకుండా పోయింది. బ్రిటిష్ సైన్యం స్థానంలో ఇక్కడ కంటోన్మెంట్‌లో భారతీయ సైన్యం ఉంటుంది. ఈ కంటోన్మెంట్‌లోనే రాష్ట్రపతి నిలయం ఉన్నది. ఇది రాష్ట్రపతి వేసవి విడిది. అజంతా టాకీస్ దగ్గరలో బ్రిటిష్ కాలంలో నిర్మించిన క్లాక్‌టవర్ ఇప్పటికీ తలెత్తుకొని నిలబడి సమయాన్ని చూపిస్తున్నది. విక్టోరియా కాలంలో బ్రిటిష్ అధికారుల గౌరవార్థం 1897లో సికింద్రాబాద్ క్లాక్ టవర్ నిర్మించారు. దీని పక్కనే 1969 తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం నిర్మించారు. 1945లో బ్రిటిష్ కంటోన్మెంట్ ప్రాంతంలో స్థానిక పరిపాలన కోసం తొలిసారి సికింద్రాబాద్ మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. 1950లో హైదరాబాద్ కార్పొరేషన్ యాక్ట్ కింద సికింద్రాబాద్ మున్సిపాలిటీని సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేశారు. అంటే ఒకవైపు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మరోవైపు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రెండు కార్పొరేషన్‌లు పనిచేసేవి. 1955లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రచురించిన సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సావనీర్ పీడీఎఫ్ కాపీ దొరికింది. దీనిలో సికింద్రాబాద్ చరిత్రతో పాటు సికింద్రాబాద్ కార్పొరేషన్ మరింతగా అభివృద్ధి చెందాలని సికింద్రాబాద్ ప్రాంతాన్ని, చరిత్రను కీర్తిస్తూ నిజాం (హైదరాబాద్ రాజ్ ప్రముఖ్) ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, అప్పటి మంత్రులు గోపాల్‌రావు ఎగ్బోటే, వినాయక్‌రావు, విద్యాలంకార్, కేవీ రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, డాక్టర్ జీఎస్ మేల్కొటే, నవాజ్ జుంగ్ బహదూర్‌ల సందేశాలు ఉన్నాయి.

అప్పటి మేయర్ రంగ పాండు. 195455లో ఎస్ఆర్ వెంకటేశం సికింద్రాబాద్ మేయర్‌గా ఉండేవారు. జూబ్లీ బస్ డిపో వద్ద ఒకవైపు రంగ పాండు విగ్రహాన్ని ఇటీవల పెద్దలు నిర్మించారు. ఆయన ఎవరో? ఆ విగ్రహం ఎందుకు నిర్మించారో ఈ తరం వారికి తెలియదు. వీళ్లందరూ తమ సందేశాల్లో సికింద్రాబాద్‌కు మరింత గుర్తింపు తేవడానికి జరపాల్సిన కృషి గురించి ప్రస్తావించారు. 1950లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఓ ఐదేండ్లు పాలన సాగింది. 1955లో సికింద్రాబాద్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు ప్రకటించారు. అప్పటి రాజ్ ప్రముఖ్ నిజాం మొదలుకొని ముఖ్యమంత్రి బూర్గుల వరకు హేమాహేమీలంతా సికింద్రాబాద్ అభివృద్ధి అవసరాన్ని వివరించారు. కానీ దురదృష్టం.. వీరి మాటలు అమలుకు నోచుకోలేదు సరికదా, ఆ వెంటనే సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని నిర్ణయించారు. 1955లో చేసిన నిర్ణయం 1960లో అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైంది. క్లాక్ టవర్ సింబల్‌తో 2006లో సికింద్రాబాద్ 200 సంవత్సరాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాణిగంజ్ తర్వాత వచ్చే బూర్గుల రామకృష్ణారావు భవన్ వద్ద క్లాక్ టవర్ సింబల్‌తో ఒక స్మారక చిహ్నం నిర్మించారు. ఈ చిహ్నాన్ని ఈ మధ్య చూస్తే పెచ్చులు ఊడిపోయి అనామకంగా ఉన్నది. హైదరాబాద్‌ది 500 ఏండ్ల చరిత్రయితే సికింద్రాబాద్ చరిత్ర 200 ఏండ్ల నాటిది. వాతావరణంతో పాటు మొత్తం సికింద్రాబాద్ భిన్నంగా ఉంటుంది. ఈ తరం వారికి అనుభవం లేకపోవచ్చు. కానీ నాలుగైదు దశాబ్దాల క్రితం హైదరాబాద్ నగరం మతకలహాలతో అట్టుడికిపోతున్నా సికింద్రాబాద్ ప్రశాంతంగా ఉండేది. కవాడిగూడ, పద్మశాలి కాలనీ, ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రాంతాలు సికింద్రాబాద్‌హైదరాబాద్ మధ్యలో ఉంటాయి.

నా బాల్యమంతా ఈ ప్రాంతంలోనే గడిచింది. సికింద్రాబాద్‌తో విడదీయరాని అనుబంధం. ఇప్పుడు ఈ ప్రాంతం పేరును చెరిపేయాలనే ప్రయత్నం దుర్మార్గం. సైబరాబాద్ ఒక నగరం కాదు. నగరంలో ఒక భాగం మాత్రమే. కానీ చంద్రబాబు నాయుడు తాను ఒక నగరాన్ని నిర్మించానని, అది సైబరాబాద్ అని పదే పదే చెప్తారు. ఇప్పుడు రేవంత్

తెలుగు దిన పత్రిక https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్

కాలనీ అభివృద్ధిలో అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలి

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

అక్షర గళం, కుత్బుల్లాపూర్ :

కాలనీ అభివృద్ధిలో అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం డివిజన్ పరిధిలోని కృష్ణ నగర్ , ఇందిరా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా బషీర్ సజీద్ లు ఎనికైనా సందర్భంగా శనివారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను , కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు .కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి , సమగ్ర అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాత)

పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆరఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీరలు పంపిణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆరఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆరఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.

బ్రహ్మోత్సవాలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆమనగల్లు, ఫిబ్రవరి 14 (అక్షర గళం): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని ఆశ్రమంలో నిర్వహించిన పంచ వల్లవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమం, ఉత్సవాలల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కేశవులు, రంగారెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాంరెడ్డి నియామకం

అక్షర గళం,శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 14 :

భారతదేశంలో ప్రముఖ ప్రజాస్వామ్య రైతు సంస్థగా పేరొందిన భారతీయ కిసాన్ సంగతన్ (బీకేఎస్) దక్షిణ భారత కన్వీనర్‌గా యర్రం శ్రీరాం రెడ్డిని నియమించింది. రైతుల సమగ్ర అభివృద్ధి, స్వావలంబన, ప్రభుత్వ పథకాల అమలు బలోపేతం దిశగా ఈ నియామకం కీలకంగా భావిస్తున్నారు. దక్షిణ భారత రాష్ట్రాలలో వ్యవసాయ నూతన సాంకేతికత, రైతు సంక్షేమం, ప్రభుత్వ పథకాల లబ్ధి రైతులకు చేరేలా సమన్వయం చేయడం తన ప్రధాన లక్ష్యమని శ్రీరాం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంట బీమా పథకాలు సమర్థంగా అమలు చేయడం, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు (ఏంఎస్‌పి) హామీ ఇవ్వడం, సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడం, అప్పుల బారిన పడిన రైతులకు ఉపశమనం కల్పించడం వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు దేశానికి వెన్నెముక మాత్రమే కాక జీవనాడి అని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్ జాతీయ కన్వీనర్ యర్రం వెంకటరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీఎం కిసాన్ సమాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల చివరి రైతు వరకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు.

అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

(మొదటిపేజీ తరువాత)

వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

పెరిగిపోయిన పండ్లు, పూల ధరలు

- మహా శివరాత్రి సందర్భంగా పండ్లు, పూలకు పెరిగిన గిరాకీ
- ధరలు పెంచిన వ్యాపారులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 14 (అక్షర గళం):

శివరాత్రి పర్వదినం సందర్భంగా పండ్లు, పూల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. శివరాత్రి సందర్భంగా పండ్లు, పూల మార్కెట్లకు శనివారం భక్తులు పోటేత్తారు. శివరాత్రి పర్వదినం రోజున శివుడికి ఉపవాస దీక్షలు పాటించే భక్తులందరూ సాయంత్రం వేళ్లల్లో పండ్లతోనే దీక్షను విరమిస్తారు. వ్యాపారులు దీనిని అసరాగా చేసుకుని అన్ని పండ్ల ధరలను ఏకంగా రెండితలు పెంచారు. వ్యాపారులు ఒక్కసారి ధరలను పెంచడంతో పట్టణ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు మాత్రం హైదరాబాద్ మార్కెట్లోనే అధిక ధరలు ఉన్నాయని చెబుతున్నారు. ఫిబ్రవరి 18 నుంచి రంజాన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పండ్ల మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుత మార్కెట్లో ఒక డజను అరటి పండ్లు రూ. 100, అంగూర్ కిలో రూ. 120, ఖర్బూజా ఒకటి రూ. 50 రూ.100, ఆపిల్, ఫైనాపిల్ రూ.100కు 3, దానిమ్మ ఒక్కటి రూ.20 రూ.30 వరకు, పుచ్చకాయలు రూ.60రూ.80లు, బత్తాయి కేజీ రూ.100 పలుకుతుంది. ఇలా అన్ని రకాల పండ్ల ధరలు పెరగడంతో పండ్లు కొనేందుకు ప్రజలు ఆలోచన చేస్తున్నారు.

బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు తెర

హైదరాబాద్,ఫిబ్రవరి14:

మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆరఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆరఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆరఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆరఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆరఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆరఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు..బీఆరఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆరఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆరఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆరఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

ఉపాధ్యాయ క్రీడాకారులకు రిక్రియేషన్ క్లబ్ క్రీడా దుస్తుల పంపిణీ

వెల్దండ ఫిబ్రవరి 14(అక్షర గళం):

కల్వకుర్తిలో ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగింది వెల్దండ ఉపాధ్యాయుల క్రికెట్ క్రీడాకారులకు వెల్దండ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. ఉపాధ్యాయ వెల్దండ క్రీడా జట్టుకు క్రీడా దుస్తుల పంపిణీ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం విద్యార్థులతో మమేకమై నిర్విరామంగా తీరిక లేకుండా గడిపే ఉపాధ్యాయులకు క్రికెట్ క్రీడలు నిర్వహించి వారిని ఉత్సాహపరచడానికి నిర్వహిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శివకుమార్, ఉపాధ్యక్షుడు రమేష్, వావిళ్ళ సంజీవ్ కుమార్ యాదవ్ ఎన్నం విజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు అనంతరం క్లాస్ మెంట్ క్లబ్ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు.

పార్టీ మారిన పలువురికి తప్పని ఓటమి

ఓటుతో ప్రజలు దూరం పెట్టిన వైనం

హైదరాబాద్,ఫిబ్రవరి14:

పదవుల కోసం ఇష్టారీతిన పార్టీలు మారిన నేతలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు గట్టిగా బుద్ధిచెప్పారు. పలు జిల్లాల్లో పార్టీ మారిన వారిని ప్రజలు తిరస్కరించారు. బీఆరఎస్ పార్టీలో పదవులు అనుభవించి, అసవరాలు తీరగానే అవతలి పార్టీలకు వెళ్లిన పలువురికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు షాకిచ్చారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన వేంరెడ్డి రాజు గతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నుంచి బీఆరఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచారు. దాంతో అతడికి బీఆరఎస్ పార్టీ ఛైర్మన్ పదవి కట్టబెట్టింది. పార్టీలో మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించిన అతను ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన తన భార్య వేంరెడ్డి సంధ్యను కౌన్సిలర్‌గా బరిలో దించారు. 16వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఆమెను ఏకంగా 374 ఓట్ల తేడాతో ఓడించి రాజుకు దిమ్మతిరిగేలా చేశారు. మెదక్ జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీలో బీఆరఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన గాడిపల్లి భాస్కర్‌ను ఛైర్మన్ పదవి కూడా వరించింది. 2014 నుంచి 2020 వరకు ఏకంగా ఆరేళ్లు మున్సిపల్ ఛైర్మన్ పదవి అనుభవించాడు. అవసరం తీరిన తర్వాత బీఆరఎస్‌ను వదిలేసి బీజేపీలో చేరాడు. ఈ ఎన్నికల్లో ఆయన భార్య గాడిపల్లి కళ్యాణిని బీజేపీ అభ్యర్థిగా బరిలో దించాడు. కానీ ఓటర్లు కళ్లుబైర్లు కమ్మేలా షాకిచ్చారు. ఏకంగా 529 ఓట్ల తేడాతో ఓడించారు. బీఆరఎస్ అభ్యర్థి గోలి మమత ఆమెపై ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రచారం చేసినా బీజేపీ అభ్యర్థికి ప్రయోజనం దక్కలేదు. బీఆరఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఛైర్మన్ పదవి అనుభవించి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయిన వ్యక్తికి ఓటర్లు బుద్ధిచెప్పారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీలో మల్లెల రాజశ్రీ బీఆరఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ తర్వాత ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. బీఆరఎస్‌లో పదవి అనుభవించిన మల్లెల రాజశ్రీ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. ఈ ఎన్నికల్లో కూడా భీంగల్ మున్సిపాలిటీలోని 9వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఓటర్లు ఆమెకు షాకిచ్చారు. ఆమెపై బీఆరఎస్ అభ్యర్థి రవి నీలం 75 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, ఫిబ్రవరి 14 (అక్షర గళం): లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎం ఏ పాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డుతమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

'లింగమధ్యే జగత్ సర్వం'

ఫిబ్రవరి 15 మహాశివరాత్రి

నిశ్శబ్దమే నాదమై నినదించే వేళ. అంధకారంలో జ్ఞానదీపం వెలిగే సమయం. పరమేశ్వరుడు కరుణార్ద్రహృదయుడై భక్తులను అనుగ్రహించే తరుణం. అదే పరమ పవిత్ర మహా శివరాత్రి పర్వదినం. మనసా వాచా పరమేశ్వరుని స్మరిస్తూ.. జాగరణలో దైవసన్నిధిని అనుభూతి చెందడమే పండుగ పరమార్థం.

కాలానికి అతీతుడైన మహాశివుడికి నిత్యం అభిషేకాలు, పూజలు చేస్తుంటాం. ఆయన మన మనసులోని మాలిన్యాలను తొలగించి స్వచ్ఛతను, సంతోషాన్ని ప్రసాదిస్తాడు. ఆ స్వామికి 64 రూపాలు ఉన్నాయని శివపురాణం పేర్కొంది. మహాశివరాత్రి సందర్భంగా పరమేశ్వరుడి ఆరు విశిష్ట రూపాలను స్మరించి తరిద్దాం.

లింగోద్భవమూర్తి : 'లింగమధ్యే జగత్ సర్వం' అన్నారు. ఈ సృష్టిమొత్తం లింగరూపంలోనే ఉందన్నది సారాంశం. ఆధిక్యత గురించి బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తిల మధ్య వివాదం తలెత్తింది. ఆ సంవాదాన్ని పరిష్కరించేందుకు పరమేశ్వరుడు అగ్నిలింగరూపాన్ని ధరించాడు. ఆ రూపానికి ఆది, అంతం ఎక్కడో చూసిరమ్మన్నాడు శివుడు. పరీక్షలో నెగ్గలేకపోయిన బ్రహ్మ అబద్ధపు సాక్ష్యం చెప్పించారు. సాక్ష్యం చెప్పిన ఆవు, మొగలిపువ్వులను శపించాడు శివుడు. మనమెంతటి సమర్థులమైనా, అధికులమైనా, వినయ విధేయలతో వ్యవహరించాలని, ధర్మానికి కట్టుబడి ఉండాలని హితవు పలికాడు. ఈ అపురూప ఘట్టం చోటుచేసుకున్న రోజును 'మహాశివరాత్రి' పర్వదినంగా వేడుక చేసుకుంటున్నాం. పూజలు, అభిషేకాలు చేస్తున్నాం. అలానే ప్రతినెలా కృష్ణపక్ష చతుర్దశి రోజును మాసశివరాత్రిగా పరమేశ్వరుని ఆరాధిస్తాం.

నటరాజమూర్తి : సృష్టి, స్థితి, లయల విన్యాసాలను తెలియజేస్తుంది నటరాజ స్వరూపం. విశ్వానికి సంబంధించిన సకలం, సర్వం నటరాజ భంగిమలో దర్శనమిస్తాయి. నటరాజు వలయాకార అగ్ని మండలం జగత్తు నిరంతర గమనానికి సంకేతం. కాలం నిలవదు, మార్పు తథ్యమని చాటుతుంది. కుడిచేతిలోని డమరుకం శబ్దమే సృష్టికి మూలమని తెలియజేస్తుంది. ఎడమ చేతిలోని అగ్నిజ్వాల లయకు ప్రతీక. అభయ ముద్రలో ఉన్న కుడి కింది చేయి భక్తులకు భయం వీడమని భరోసా ఇస్తుంది. కాళ్ల వైపు చూపుతున్న ఎడమ కింది చేయి శరణు వేడితే మోక్షం ప్రాప్తిస్తుందని సూచిస్తుంది. మరుగుజ్జు రూపాన్ని తొక్కిపెట్టిన కుడి పాదం అజ్ఞానాన్ని, అహంకారాన్ని తొలగిస్తున్నట్టుగానూ, పైకి లేచి ఉన్న ఎడమ పాదం విముక్తికి చిహ్నంగానూ దర్శనమిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. జీవితం ఒక నృత్యమని, అందులో లయ సాధించినప్పుడే మోక్షం పొందుతామని నటరాజ స్వరూపం ప్రబోధిస్తుంది.

దక్షిణామూర్తి : సహజంగా మనలో ఉన్న పరిపూర్ణతను విద్య వ్యక్తపరుస్తుంది అన్నారు స్వామి వివేకానంద. ఆ విద్యను అందించేది గురువు. శివుడు ఆదిగురువు. అపార ఆధ్యాత్మిక జ్ఞానసంపద ఉన్నప్పటికీ సమాధానం దొరకని అంశాలుంటాయి. అలా మహర్షులను సైతం తికమకపెట్టే ధర్మసందేహాలను దక్షిణామూర్తి నివృత్తి చేస్తాడు. ఊరికి ఉత్తరాన శ్మశానముంటుంది. ఆ శ్మశానమే శివుడి ఆవాసం. స్వామి దక్షిణాభిముఖుడై ఉండటంవల్ల.. ఈ రూపానికి దక్షిణామూర్తి అనే పేరొచ్చిందని చెబుతారు. అంతకుమించిన ఆంతర్యమూ ఉంది. ఆయనను ఆరాధించేందుకు ఉత్తరదిక్కుకి తిరగాలి కదా! అంటే మనం చివరికి చేరుకునే స్థలం వైపు. అక్కడికి చేరుకునేలోపు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించి.. జ్ఞానం ఆర్జించేందుకు, చివరికి ముక్తిని పొందేట్లు చేయడానికి పరమశివుడు ఈ రూపం దాల్చాడు.

భిక్షాటనమూర్తి: బ్రహ్మతలను ఖండించిన దోషం పోవడానికి భిక్షాటనమూర్తి రూపం ధరించాడు శివుడు. జడలుకట్టిన జుట్టుతో, ఒంటిమీద పులి చర్మాన్ని, మెడలో పాములను ధరించి, బ్రహ్మకపాలాన్నే భిక్షాపాత్రగా చేసుకుని.. ఇంటింటా భిక్ష కోరుతూ వీధుల్లో తిరుగుతాడు. తమను తాము గొప్పగా ఊహించుకుని అహంకరించేవారు పరమేశ్వరుడి నిరాడంబరత్వం చూసి పరివర్తన చెందడం తథ్యం. భిక్షాటనమూర్తి తన చివరి మజిలీగా వారణాసి చేరుకుంటాడు. రాజ్యం సుభిక్షంగా ఉందని విర్రవీగుతున్న కాశీరాజు భిక్ష కోరుతూ తిరుగుతున్న శివుణ్ణి చూసి, తనకది అవమానమని ఆగ్రహించాడు. సాక్షాత్తూ అన్నపూర్ణాదేవి స్వామివారికి భిక్ష అందించడంతో పాటు రాజుకి జ్ఞానోదయం కలిగిస్తుంది. అహంకారం తలకెక్కితే.. ఇక ఎన్ని సంపదలున్నా.. అవన్నీ వ్యర్థమే నని ప్రబోధిస్తుంది భిక్షాటనమూర్తి స్వరూపం.

కాలసంహారమూర్తి : ఎదుటివారు చెప్పింది అపార్థం చేసుకుంటే ఘోర ఫలితం ఉంటుందని తెలియచేసేందుకు ఈ రూపం దాల్చాడు శివుడు. సంతానం లేని మృకండ మహర్షి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై 'వృద్ధాప్యం వరకూ జీవించే దుష్టపుత్రుడు కావాలా, పదహారేళ్లే జీవించినా తదుపరి చిరంజీవిగా మిగిలిపోయే కుమారుడు కావాలా?' అనడిగాడు. సజ్జనుడే కావాలన్నాడు మహర్షి. అలా జన్మించిన మార్కండేయుడు బాల్యం నుంచే సదా శివధ్యానంలో ఉండేవాడు. అతడు తిరుక్కుడైయూర్ క్షేత్రం చేరుకుని అమరత్వం కోసం శివుణ్ణి పూజించసాగాడు. బాలుడికి మరణసమయం సమీపించగా యమధర్మరాజు వచ్చాడు. శివసన్నిధిలో ఉన్న మార్కండేయుని పైకి యమపాశం విడువగా అది శివలింగాన్ని తాకింది. దాంతో శివుడు ప్రళయకాల రుద్రుడిగా ప్రత్యక్షమై యముణ్ణి సంహరించాడు. కానీ మార్కండేయుని కోరిక మేరకు తిరిగి బతికించాడు. తన కర్తవ్యంలో ఈ పొరపాటు ఎలా జరిగిందన్న సందేహాన్ని యముడు వ్యక్తం చేయగా.. తానిచ్చిన వరంలో మరణం ప్రస్తావనే లేదు, పదహారేళ్ల తర్వాత చిరంజీవిగా మిగిలిపోతాడని మాత్రమే చెప్పానని వరంలోని ధర్మ సూక్ష్మాన్ని వివరించాడు. మనం ధర్మమార్గాన్ని అనుసరించేందుకు శివతత్వాన్ని అర్థం చేసుకోవాలి. అందుకు మహాశివ రాత్రి రోజున చేసే జాగరణ సరైన సమయం. లింగరూపంలో ఉన్న శివుని అర్చిస్తూనే, ఆ స్వామి వివిధ రూపాల్లోని అర్థాన్ని, పరమార్థాన్ని గ్రహించాలి. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్న నానుడిని గుర్తుంచుకుంటే మనకు ఎవరి మీదా, ఎన్నడూ కోపతాపాలు రావు. జన్మను సార్థకం చేసుకోగలుగుతాం. అలా జీవనం ప్రశాంతంగా గడిచేందుకు ఆ పార్వతీపరమేశ్వరులను పూజిద్దాం.

అంతరంగశోధన

దేవుని మెడలో అలంకరించిన దండ భక్తి భావనను చాటితే.. భక్తుని మెడలో పూసల సరం నియమనిష్టలకు సంకేతం. చేతిలోని జపమాల మంత్ర సంఖ్యను తెలియజేస్తూనే ఏకాగ్రతను పెంచుతుంది. వివిధ దేవుళ్లకు భిన్నమైన పూజా రీతులు, రకరకాల నైవేద్యాలు ఉన్నట్టే.. దైవానికి సమర్పించే దండల్లోనూ అనేక రీతులున్నాయి.



ఏ దేవుడికైనా పూలహారం సమర్పించడం సాధారణం. అయితే.. ఒక్కో దైవానికి ఒక్కో విశిష్ట అలంకరణ ఆనవాయితీగా ఉంది. శివుని మెడలో రుద్రాక్షమాల, విష్ణువు మెడలో కౌస్తుభహారం, కృష్ణుడి కంఠసీమలో వైజయంతీ మాల ఉంటాయి. అయ్యప్ప మణిమాలతో దర్శనమిస్తాడు. సరస్వతీదేవి అక్షమాలను, పార్వతీదేవి పూసల పేరును, లక్ష్మీదేవి కాసులపేరును ధరించి కనిపిస్తారు. దేవునికి ధూపం, దీపం, నైవేద్యం, నీరాజనం తదితర పదహారు రకాల సేవలతో కూడిన షోడశోపచార పూజ చేస్తారు. అనంతరం పూలమాలలతో అలంకరిస్తారు. వాటిలో భిన్న పుష్పాలు, ఆకృతులు ఉంటాయి. తిరుమలలో వేంకటేశ్వరస్వామికి అలంకరించే పూలమాలలు ప్రత్యేకం. వివిధ సేవలలో వేర్వేరు కొలతలతో పూల దండలను అలంకరిస్తారు. వాటిలో శిఖామణి దండ, సాలిగ్రామ మాల, కంఠసరి, వక్షస్థల లక్ష్మి, శంఖుచక్రం, కఠారిసరం, తావళములు, తిరువడి దండలు మొదలైన రకాలున్నాయి. దండకు మాల, హారం, సరం, పేరు.. అనేవి పర్యాయ పదాలు. అన్నిటినీ ఒకే అర్థంలో వాడకూడదు. అల్లిక, తయారీ, వినియోగించే తీరును బట్టి స్పష్టమైన తేడాలున్నాయి. దారాన్ని చేతితో మెలికలు తిప్పుతూ పూలను అల్లితే అది మాల. సూదితో దారానికి గుచ్చితే దండ. పూసలను దారంలో కూర్చితే సరం. వెండి బంగారాలతో తయారుచేస్తే అది హారం. రుద్రాక్ష, తులసి, తామర, కరుంగలి, చందన పూసలతో రూపొందించే సరాలు, తావళాలు ఆధ్యాత్మికతను పెంచి పోషిస్తాయని పౌరాణిక కథలు తెలియజేస్తున్నాయి. మాలలను ధరించడం వల్ల ఆధ్యాత్మిక వృద్ధి కలుగుతుంది, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. అమంగళ దోషాలు, దృష్టి సోకడం నుంచి రక్షణ కలుగుతుంది. ఒత్తిడి, భయం, ఆందోళన తగ్గుతాయి. మానసిక స్థైర్యం పెరుగుతుంది. సూక్ష్మ దృష్టి అలవడుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. వినాయకుడికి ప్రీతికరమైంది చందన పూసల హారం. దీన్ని ధరిస్తే మానసిక శాంతి, సానుకూలశక్తి పెంపొందుతాయి. పరమశివుడికి ప్రీతికరమైనవి రుద్రాక్షలు. ఆయన కళ్ల నుంచి వెలువడిన అశ్రువులే రుద్రాక్షలు. వాటిని ధరించడం వల్ల ధర్మబద్ధత, ఆధ్యాత్మిక ప్రగతి, నిర్మోహం కలుగుతాయి. తామరపువ్వులకు దిగువ భాగాన కాయల్లోని విత్తనాలు గట్టి పూసల్లా ఉంటాయి. వీటిని ధరిస్తే జ్ఞానసిద్ధి కలుగుతుంది. అంతరంగశోధన వృద్ధిచెందుతుంది. ఈ గింజల్లోని ఔషధ గుణాల వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక స్థైర్యం చేకూరుతాయి. నల్లచేవమాను కర్రతో తయారయ్యే కరుంగలి మాలలు సుబ్రహ్మణ్య స్వామికి ప్రియమైనవని చెబుతారు. ఆ స్వామి అనుగ్రహం కోసం కరుంగలి మాలలు ధరిస్తారు. ముదిరిన తులసి మొక్కలతో రూపొందే తులసి పూసల మాలలను విష్ణు భక్తులు మెడలో ధరించడానికి, జపం చేయడానికి వినియోగిస్తారు. అయ్యప్ప దీక్షాధారులు రుద్రాక్ష, తులసి మాలలను ధరిస్తారు. దీక్షను మాల ధారణ అంటారు. అంటే కఠినమైన వ్రతాచరణ నియమాలతో ఆధ్యాత్మిక ప్రయాణం మొదలైందని సూచించడం. స్వాతి కార్తెలో కురిసే వాన చినుకులు ముత్యపు చిప్పల్లో చేరి.. ముత్యాలుగా రూపొందుతాయి. ఇవి చంద్రుడికి ఇష్టమైనవి. ముత్యాలను ధరిస్తే చూపరులకు చెడు ఆలోచనలు కలగకుండా రక్షణ కలుగుతుందని పెద్దలు చెబుతారు. ముత్యాలతో మానసిక ప్రశాంతత, ఆయురారోగ్యాలు కలుగుతాయని, ప్రతికూల ఆలోచనలు తొలగి, ఏకాగ్రచిత్తం అలవడుతుందని విశ్వసిస్తారు. పెళ్లయిన స్త్రీలు ధరించే నల్ల పూసలు శుభసూచకమని, పరుల దృష్టి సోకదని విశ్వసిస్తారు. పగడాలను ధరించడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని, మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. పగడాలు శ్రేష్ఠమని, వాటిని ధరించడం వల్ల ఆపదలు, అనారోగ్యాలు తొలగుతాయని జ్యోతిష శాస్త్రం పేర్కొంది. ఆవేశం, ఆందోళన, వ్యాకులచిత్తం లాంటి బాధలను అరికట్టి సమతుల్యతను పెంపొందిస్తాయి పగడాలు.

జపమాల.. మేరువు: దైవనామాన్ని స్మరించేటప్పుడు.. జప సంఖ్యను లెక్కించడానికి ఉపయోగించే పూసల సరాలను తావళం, జపమాల అంటారు. ఇది ప్రశాంతత కలిగిస్తుంది. ఏకాగ్రత పెంచుతుంది. 54 లేదా 108 పూసలతో పాటు లెక్కలోకి రాని మరో అదనపు పూస ఉంటుంది. దీన్ని 'మేరువు' అంటారు. గుండ్రంగా తిప్పుతూ జప సంఖ్యను తెలుసుకోవడానికి తోడ్పడుతుందీ మేరువు.

పత్ర మాలికలు: దైవారాధనలో పత్రాలకూ ప్రాముఖ్యత ఉంది. తులసి, మరువం, దవనం, తమలపాకు.. ఇలా వివిధ రకాలైన ఆకులతో మాలలల్లి సమర్పిస్తారు. తులసి దళాలతో అల్లిన మాలలు విష్ణుమూర్తికి ప్రీతికరమైనవని పురాణ కథలు తెలియజేస్తున్నాయి. 'ఆముక్తమాల్యద' కావ్యానికి ఆ పేరు రావడానికి కారణం తులసి మాలలే. తాను ధరించి విడిచినది అనేది అర్థం. తండ్రి అల్లిన తులసి మాలలను శ్రీరంగనాథునికి అలంకరించకముందే గోదాదేవి తాను ధరించి తర్వాత స్వామికి సమర్పించేది. తమలపాకుల దండలతో ఆంజనేయస్వామిని అర్చిస్తారు. మరువం, దవనం, వంటి సుగంధ పత్రాలతోను మాలలల్లి భగవంతుని సేవలో ఉపయోగిస్తారు. ఇవే కాకుండా యాలకులు లాంటి సుగంధ ద్రవ్యాలతోనూ 'సరం' కూర్చి ఆరాధిస్తారు.

కాలభైరవాష్టకం..!!

దేవరాజసేవ్యమానపావనాంఘ్రిపంకజం
వ్యాలయజ్ఞసూత్రమిందుశేఖరం కృపాకరమ్
నారదాదియోగిబృందవందితం దిగంబరం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
దేవేంద్రునిచే పూజించబడిన పాదపద్మములు కలిగిన,
సర్పమును యజ్ఞోపవీతముగా కలిగినవాడు,
చంద్రుని ధరించిన వాడు, కృపాకరుడు,
దిక్కులనే వస్త్రములుగా కలిగినవాడు,
నారదాది మునులచే పూజించబడినవాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

భానుకోటిభాస్వరం భవాబ్ధితారకం పరం
నీలకంఠమీప్సితార్థదాయకం త్రిలోచనమ్
కాలకాలమంబుజాక్షమక్షశూలమక్షరం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
కోటి సూర్యుల వలె ప్రకాశించువాడు,
భవ సాగరాన్ని దాటించేవాడు,
జగదీశ్వరుడు, నీలకంఠుడు, కామ్యములను తీర్చేవాడు, మూడు నేత్రములు కలిగినవాడు,
యముని సంహరించినవాడు,
పద్మములవంటి కన్నులు కలవాడు,
అజేయమైన త్రిశూలము కలవాడు,
నాశనము లేని వాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

శూలటంకపాశదండపాణిమాదికారణం
శ్యామకాయమాదిదేవమక్షరం నిరామయమ్
భీమవిక్రమం ప్రభుం విచిత్రతాండవప్రియం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
శూలము, టంకము, పాశము, దండము మొదలగునవి ఆయుధములుగా ధరించినవాడు,
నల్లని మేను కలవాడు, సనాతనుడు,
నాశనము లేనివాడు, మొదటి వాడు,
రోగాతీతుడు, విక్రముడు, ప్రభువు,
విచిత్రమైన నాట్యమంటే ఇష్టపడేవాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

భుక్తిముక్తిదాయకం ప్రశస్తచారువిగ్రహం
భక్తవత్సలం స్థితం సమస్తలోకవిగ్రహమ్
వినిక్వణన్మనోజ్ఞహేమకింకిణీలసత్కటిం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
కోరికలు తీర్చి, మోక్షాన్ని ప్రసాదించేవాడు,
పేరుగాంచిన సౌందర్యమున్న దేహము కలవాడు,
శివుని రూపమైనవాడు (స్థిరమైన వాడు),
భక్త ప్రియుడు, లోకేశ్వరుడు,
వేరు వేరు రూపములలో విలసించేవాడు,
చిరుగజ్జెలు కలిగిన బంగారు మొలత్రాడు ధరించినవాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

ధర్మసేతుపాలకం త్వధర్మమార్గనాశనం
కర్మపాశమోచకం సుశర్మధాయకం విభుమ్
స్వర్ణవర్ణశేషపాశశోభితాంగమండలం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
ధర్మమనే సేతువును పాలించేవాడు,
అధర్మ మార్గములను నాశనము చేసేవాడు,
కర్మ బంధములనుండి తప్పించేవాడు,
మనము చేసే తప్పులను తెలియచేసి మనకు సిగ్గును కలిగించేవాడు,
బంగారు రంగులో ఉన్న పాశము,
సర్పములు దేహ భాగములకు ఆభరణములుగ కలిగిన వాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

రత్నపాదుకాప్రభాభిరామపాదయుగ్మకం
నిత్యమద్వితీయమిష్టదైవతం నిరంజనమ్
మృత్యుదర్పనాశనం కరాలదంష్ట్రమోక్షణం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
రత్నములు పొదిగిన పాదుకలచే అలరారు పాదములు కలిగిన వాడు,
అంతటాయున్న వాడు, రెండవసాటి లేనివాడు,
ఇష్ట దైవమైన వాడు, కామ్యములు తీర్చేవాడు,
మానవులకు మృత్యు భయమును తొలగించేవాడు,
తన దంతముల ద్వారా మోక్షమును కలిగించేవాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

అట్టహాసభిన్నపద్మజాండకోశసంతతిం
దృష్టిపాతనష్టపాపజాలముగ్రశాసనమ్
అష్టసిద్ధిదాయకం కపాలమాలికాధరం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
బ్రహ్మచే సృష్టించబడిన వాటిన తన అట్టహాసముతో నాశనము చేయ గలిగినవాడు,
సర్వ పాపహరము చేసే వీక్షణములు కలవాడు,
తెలివైన వాడు, చండ శాసనుడు,
అష్ట సిద్ధులను ప్రసాదించే వాడు (అణిమ, గరిమ మొదలగునవి),
కపాలముల మాల ధరించిన వాడు,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

భూతసంఘనాయకం విశాలకీర్తిదాయకం
కాశివాసలోకపుణ్యపాపశోధకం విభుమ్
నీతిమార్గకోవిదం పురాతనం జగత్పతిం
కాశికాపురాధినాథకాలభైరవం భజే

తాత్పర్యము:
భూత నాయకుడు, ఎనలేని కీర్తిని ప్రసాదించేవాడు,
కాశీ పురవాసుల మంచి చెడును విచారించేవాడు,
నీతి మార్గములో నిపుణుడు, శాశ్వతుడు, జగత్పతి,
కాశీ పురానికి పాలకుడు అయిన కాలభైరవుని నేను భజిస్తున్నాను.

ఫల శ్రుతి.

కాలభైరవాష్టకం పఠంతి యే మనోహరం
జ్ఞానముక్తిసాధనం విచిత్రపుణ్యవర్ధనమ్
శోకమోహదైన్యలోభకోపతాపనాశనం
ప్రయాంతి కాలభైరవాంఘ్రిసన్నిధిం నరా ధ్రువమ్

ఇతి శ్రీమచ్ఛంకరాచార్యవిరచితం
శ్రీ కాలభైరవాష్టకం సంపూర్ణమ్

తాత్పర్యము:
అనంతమైన జ్ఞాన మూలమైన,
సత్కార్యముల ఫలమును పెంచే,
శోకము, మోహము, దారిద్ర్యము, కోరిక, క్రోధము నశింపచేసే ఈ మనోహరమైన కాలభైరవాష్టకం
పఠించే వారికి ఆ భైరవుని సన్నిధి ప్రాప్తించును.

ఇది శ్రీమచ్ఛంకరాచార్యులు రచించిన కాలభైరవాష్టకం.

కాలభైరవుడు:
దేవాలయములలో క్షేత్రపాలకునిగా కాలభైరవుడు
ఉంటే క్రింది శ్లోకమును చెప్పి ముందుగా అయన దర్శనం చేయవలెను.
తీక్ష్ణ దంష్ట్ర!మహాకాయ!కల్పాంతదహనోపమ |
భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతు మర్హసి ||
కాలభైరవుడు పరమేశ్వరుని అపరాంశ.
రౌద్రస్వరూపుడు. రక్షాదక్షుడు.
దుష్టగ్రహబాధలు నివారించగల శక్తి మంతుడు.
కాలభైరవుడు అనగానే హేళనగా కుక్క అనేస్తాం.
కుక్కను వాహనంగా చేసుకుని తిరిగేవాడే తప్ప ఆయనే కుక్క కాదు.
కుక్క అంటే విశ్వసనీయతకు మారుపేరు.
రక్షణకు కూడా తిరుగులేని పేరు.
సమయోచిత జ్ఞానానికి ప్రతీక.
కాలస్వరూపం ఎరిగిన వాడు.
కాలంలాగే తిరుగులేనివాడు.
ఎంత వ్యయమైనా తరిగిపోనివాడు.
శాశ్వతుడు, నిత్యుడు.
వీరభద్రుడిలా భైరవుడు కూడా శివుడు నుంచి ఆవిర్భవించినవాడే.
తన విషయంలో అవమానకరంగా వ్యవహరించిన బ్రహ్మదేవుడిపై శివుడు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తాడు. ఆ సమయంలోనే 'భైరవుడు'ని సృష్టించి బ్రహ్మదేవుడి తలను ఖండించమని ఆదేశిస్తాడు.
మహా పరాక్రమవంతుడైన భైరవుడు క్షణమైనా ఆలస్యం చేయకుండా బ్రహ్మదేవుడికి గల అయిదు శిరస్సుల్లో ఏ శిరస్సు అయితే శివుడిని అవమానపరుస్తూ మాట్లాడిందో ఆ శిరస్సును ఖండించి వేస్తాడు.
ఆ తరువాత బ్రహ్మహత్యాపాతకం నుంచి బయటపడటానికి తాను ఏం చేయాలో చెప్పమని భైరవుడు అడుగుతాడు.
ఖండించినటు వంటి బ్రహ్మదేవుడి యొక్క కపాలంతో అనేక ప్రాంతాలను దర్శిస్తూ ఉండమనీ,
ఎక్కడైతే ఆ కపాలం పడుతుందో,
అక్కడితో ఆయన పాపం ప్రక్షాళన అవుతుందని శివుడు చెబుతాడు.
భైరవుడి చేతిలోని బ్రహ్మదేవుడి కపాలం కిందపడిన ప్రదేశమే నేడు 'బ్రహ్మ కపాలం' గా పిలవబడుతోంది.
ఆ తరువాత శివాజ్ఞ ప్రకారం కాశీ క్షేత్రానికి చేరుకున్న భైరవుడు అక్కడ క్షేత్రపాలకుడిగా ఉండిపోతాడు.

భైరవుని రూపాలు ఎనిమిది...

1) కాలభైరవ
2) అసితాంగ భైరవ
3) సంహార భైరవ
4) రురు భైరవ
5) క్రోధ భైరవ
6) కపాల భైరవ
7) రుద్ర భైరవ
8) ఉన్మత్త భైరవ



ఏఐతో సైబర్ మోసాలు..

రాజీవ్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. కట్ చేశాడు. మళ్లీ ఫోన్. ఎత్తగానే అవతలి నుంచి 'మావయ్య గారికి యాక్సిడెంట్ అయ్యింది. ఇప్పుడే హాస్పిటల్‌కి వచ్చా. ఇక్కడ ఇన్సూరెన్స్ చెల్లదంటున్నారు. హాస్పిటల్ వారు అడ్వాన్స్‌గా రూ.లక్ష కట్టమంటున్నారు. ఈ నంబర్‌కి పంపించు' అంటూ భార్య ఫోన్ కట్ చేసింది.

ఇలా ఎవరైనా ఫోన్ చేసి 'ఎమర్జెన్సీ' అని చెప్పగానే కాళ్లూచేతులూ వణికిపోతాయి. ఒళ్లంతా చెమటలు పట్టేస్తాయి. కంగారులో ఏం చేస్తామో మనకే తెలీదు. కానీ, రాజీవ్ మాత్రం ఎప్పటిలానే తన పనిలో మళ్లీ నిమగ్నమైపోయాడు. కాసేపటి తర్వాత భార్యకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారు. అంతకుముందు భార్య పేరుతో వచ్చిన ఆ కాల్ ఫేక్ అని రాజీవ్ పసిగట్టడమే ఇందుకూ కారణం. కానీ అదెలా సాధ్యం? అంత కంగారులోనూ అది ఫేక్ అని ఎలా గుర్తించాడు?.. ఇదే సీక్రెట్ కోడ్ మహిమ. దీన్నే సేఫ్‌వర్డ్ లేదా పాస్‌ఫ్రేజ్‌గా సైబర్ నిపుణులు వ్యవహరిస్తున్నారు. ఇంతకీ ఏమిటిది? ఏఐ యుగంలో ఇదెలా ఉపయోగపడుతుంది?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతోంది. దీన్ని సైబర్ నేరగాళ్లు కూడా అస్త్రాలుగా మలుచుకుంటున్నారు. వాయిస్‌లను క్లోన్ చేసి, డీప్‌ఫేక్ వీడియోలతో అమాయక ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల పేరుతో వాయిస్/వీడియో కాల్స్ చేసి 'ఎమర్జెన్సీ' అంటూ డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలాంటి ఏఐ మోసాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలంటే కుటుంబ సభ్యుల మధ్య

ఒక సేఫ్‌వర్డ్/పాస్‌ఫ్రేజ్ ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

మన ఇంట్లో వ్యక్తులు కంగారుపడుతూ ఫోన్ చేస్తే వేరే తలంపు లేకుండా అవతలి వ్యక్తులు చెప్పింది చేయడానికే ప్రయత్నిస్తాం. దీన్నే ఆయుధంగా మలుచుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఇక్కడే ఓ అనుమానం రావొచ్చు. మరి ఆ వాయిస్ వారికి ఎక్కడిది? సామాజిక మాధ్యమాల్లో మనం పెట్టే వీడియోలు, వాయిస్ మెయిల్స్, ఫోన్‌కాల్స్ చాలు.. అవతలి వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేయడానికి. కేవలం 30 సెకన్ల ఆడియో/వీడియో ఉంటే చాలు ఎవరి వాయిస్‌నైనా ఇట్టే క్లోన్ చేసేయొచ్చని చెబుతున్నారు సైబర్ నిపుణులు. అంతేకాదు హ్యాకర్లు ఇంట్లో వారి ఫోన్ నంబర్లను కూడా స్పూఫ్ చేయగలరు. అంటే మన కాంటాక్టులోని వ్యక్తులే ఫోన్ చేస్తున్నారని మనల్ని నమ్మించగలరు.

ఈ తరహా మోసాలను అరికట్టడానికి పాస్‌ఫ్రేజ్ పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఒక పదం లేదా పదబంధం లేదా ఒక ప్రశ్నను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎంత అత్యవసర సమయంలోనైనా మీరు దాని గురించి ప్రస్తావించగానే అవతలి వ్యక్తులు దానికి సమాధానం ఇచ్చేలా, గుర్తుండేలా సేఫ్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్‌లు, పుట్టినరోజులు, పెట్‌నేమ్స్ వంటివి పెట్టకపోవడం మంచిది. మరీ ముఖ్యంగా ఈ కోడ్‌ను సామాజిక మాధ్యమాల్లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ పంచుకోవద్దు. వ్యక్తుల మధ్యే ఉండాలి. కేవలం మీ కుటుంబసభ్యులు, స్నేహితులతోనే పంచుకోండి. 'ఎమర్జెన్సీ' కాల్స్ వస్తే ఇలా చేయండి..

సైబర్ నేరగాళ్లు ఒకవేళ ఆడియో కాల్ చేస్తే వెంటనే వీడియో కాల్ ఆన్ చేయండి. వీడియో కాల్ చేస్తారని ఊహించకపోతే అవతలి వ్యక్తి ఇట్టే దొరికిపోతారు. కొన్నిసార్లు వీడియోను కూడా డీప్‌ఫేక్ చేసేందుకు సిద్ధంగా ఉండొచ్చు.

రెండో ఆప్షన్.. ఒకవేళ మీ ఇంట్లో వ్యక్తులే కాల్ చేసినట్లు అనిపించినా వారి మాటల్లో తేడా గమనిస్తే అదే నంబర్‌కు తిరిగి కాల్ చేయండి. తద్వారా వారి క్షేమ సమాచారాన్ని ధ్రువీకరించుకోవచ్చు.

చివరి ఆప్షన్‌గా సేఫ్‌వర్డ్‌ను వాడండి. దానికి సమాధానం చెప్పడానికి అవతలి వారు తటపటాయిస్తే సైబర్ నేరగాళ్ల పనే అని మీరు గుర్తించొచ్చు. వివిధ దేశాల్లో ఈ తరహా మోసాలు పెద్దఎత్తున జరుగుతుండగా.. భారత్‌లోనూ ఈ మోసాలు వెలుగుచూస్తున్నాయి.

ఇంతకీ రాజీవ్ ఏం చేశాడంటే..? తనకు విషయం చెప్పగానే కాల్ కట్ చేసే ముందు ''ఓటీటీ సినిమా'' అని అడగ్గా.. అవతలి నుంచి సమాధానం లేకుండానే ఫోన్ కట్ అయ్యింది. ఒకవేళ తన భార్యే అయ్యుంటే సమాధానం వచ్చేది. అది రాకపోవడంతో ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని రాజీవ్ గుర్తించగలిగాడు. ఇంతకీ వాళ్లు పెట్టుకున్న సేఫ్‌వర్డ్ ఏంటో తెలుసా? ఓటీటీ సినిమాకు సందేమ్యాగీ స్టోరీ!! ఇంకెందుకాలస్యం మీరూ పెట్టుకోండి 'సేఫ్'వర్డ్.

రూ.7 లక్షల కోట్ల సంపద ఆవిరి

సూచీలకు 1% పైగా నష్టం
లోహ, ఐటీ షేర్లలో అమ్మకాలు

అన్ని రంగాల షేర్లలో ముఖ్యంగా ఐటీ, లోహ రంగాల్లో అమ్మకాలు తీవ్రమై మన స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మన మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు తగ్గి 90.66 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.18% తగ్గి 67.41 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.02 లక్షల కోట్లు తగ్గి రూ.465.46 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 82,902.73 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 83,674.92) ఆరంభమైంది. అదే ఒరవడిని కొనసాగిస్తూ 82,534.55 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 1048.16 పాయింట్ల నష్టంతో 82,626.76 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336.10 పాయింట్లు కోల్పోయి 25,471.10 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,444.30 వద్ద కనిష్ఠాన్ని, 25,630.35 వద్ద గరిష్ఠాన్ని తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 953.64 పాయింట్లు, నిఫ్టీ 222.6 పాయింట్లు నష్టపోయాయి.

ఆ రెండు మినహా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో

ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్ మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. హిందుస్థాన్ యునిలీవర్ 4.35%, ఎటర్నల్ 4.26%, టాటా స్టీల్ 2.35%, టైటన్ 2.23%, టీసీఎస్ 2.17%, పవర్‌గ్రిడ్ 2.17%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.07% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 2.43%, ఎస్‌బీఐ 0.53% పెరిగాయి.

గాడియమ్ ఐపీఎఫ్ అండ్ వుమెన్ హెల్త్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 20న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఐపీఓ ద్వారా రూ.150 200 కోట్లు సమీకరించనుంది.

హిందుస్థాన్ యునిలీవర్ నుంచి విభజన అయిన నేపథ్యంలో క్వాలిటీ వాల్స్ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఈనెల 16న నమోదవుతాయి.

వెల్డింగ్ ఉత్పత్తులు రూపొందించే ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, పరుపుల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్, ఫార్మా కంపెనీ హెగ్జాగాన్ న్యూట్రిషన్, ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ సంస్థల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం లభించింది.

ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ మార్కెట్లోకి అడుగుపెట్టే ప్రణాళికలో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు నేషనల్ కమొడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్) ప్రకటించింది.

జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఆదాయం రూ.4,083 కోట్లు



హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.4,082.77 కోట్ల ఆదాయంపై రూ.173.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 202425 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.2,748.22 కోట్లు, నికర లాభం రూ.202.10 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ.11,157.85 కోట్లు, నికర లాభం రూ.71.90 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి రూ.7,859.20 కోట్ల ఆదాయం, నికర నష్టం రూ.564.24 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ పరంగా కంపెనీ పనితీరు మెరుగుపడిందని యాజమాన్యం పేర్కొంది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే టారిఫ్ ఆర్డర్ల అమలుతో, భవిష్యత్తులో ఆదాయం, మార్జిన్లు మెరుగుపడతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే కాదు న్యాయవాదులు, అకౌంటెంట్లకూ కష్టమే

మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ అంచనా

వచ్చే ఏడాది, ఏడాదిన్నర సమయంలో 'వైట్ కాలర్' ఉద్యోగాల్లో చాలా వరకు ఆటోమేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) వేగంగా వృద్ధి చెందుతుండటంతో, పలు ఐటీ కంపెనీల్లో లేఆఫ్‌ల ప్రకటనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సులేమాన్ ఒక ఆంగ్లపత్రిక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్, స్టాక్ మార్కెట్లను నష్టపరుస్తున్న తరుణంలో ముస్తఫా ఇలా పేర్కొనడం గమనార్హం. కేవలం కోడర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపైనే కాకుండా కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసే న్యాయవాదులు, అకౌంటెంట్లు, ప్రాజెక్టు మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లపైనా ఏఐ ప్రభావం పడనుందని సులేమాన్ అంటున్నారు. రాబోయే 1218 నెలల్లోనే ఈ పోస్టులు ఏఐతో భర్తీ అయ్యే అవకాశం ఉంద'ని పేర్కొన్నారు. 23 ఏళ్లలో పెద్ద పెద్ద కంపెనీల్లో ఏఐ ఏజెంట్లే సమర్థంగా సమన్వయ బాధ్యతలనూ నిర్వర్తించగలవని తెలిపారు. ఎప్పటికపుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఏఐ ఏజెంట్లు మెరుగవుతాయని, స్వయం ప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుంటూ వెళతాయని అన్నారు.

మరింత సులువుగా కొత్త మోడళ్లు

ఏఐ మెరుగయ్యే కొద్దీ కొత్త మోడళ్ల సృష్టి, వాడకం మరింత సులభతరం కానుంది. పాడ్‌క్యాస్ట్ లేదా బ్లాగ్‌ను రూపొందించేందుకు కొత్త మోడల్‌ను సృష్టించే అవకాశం ఉంది. ప్రతి కంపెనీ/వ్యక్తి అవసరాలకు తగ్గట్లుగా ఏఐని డిజైన్ చేయడమూ భవిష్యత్తులో సాధ్యంకావొచ్చని ఆయన అన్నారు.

సొంత, శక్తిమంత మోడళ్ల దిశగా

ఓపెన్‌ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు.. సొంత, శక్తిమంత ఫౌండేషన్ మోడళ్లను అభివృద్ధి చేయడంపై మైక్రోసాఫ్ట్ దృష్టి సారిస్తోందని ముస్తఫా

వివరించారు. ఇప్పటికే అధునాతన ఏఐ వ్యవస్థలపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అసెంబ్లింగ్, డేటా సెట్ల నిర్వహణపై మైక్రోసాఫ్ట్ భారీగా ఖర్చు చేస్తోందని తెలిపారు. జూన్‌తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 140 బి.డాలర్ల (దాదాపు రూ.12.7 లక్షల కోట్ల) మూలధన వ్యయాలు చేయనుందని అంచనా. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, ఎక్కువసేపు వేచిచూడడం వంటి సమస్యలకు పరిష్కారంగా 'మెడికల్ సూపర్‌ఇంటెలిజెన్స్'ను తీసుకురావాలని భావిస్తున్నట్లు సులేమాన్ తెలిపారు. మనుషుల నియంత్రణలోనే ఉండే 'హ్యూమనిస్ట్ సూపర్ ఇంటెలిజెన్స్'నూ అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. ఏఐ ల్యాబ్‌లు తమ సృష్టికర్తల జోక్యాన్ని అడ్డుకుంటాయన్న ఆందోళనల మధ్య, కంపెనీ ఈ లక్ష్యాన్ని పెట్టుకుంది.

అంత వేగంగా ఏమీ పోవు

ఏఐ అనేదేమీ ఒక క్లౌడ్ కాదు. దానిని కొనుగోలు చేసి సిస్టమ్‌లో పెట్టగానే ఆటోమేటిక్‌గా పని జరిగిపోదు. తాము వినియోగిస్తున్న ఐటీ వ్యవస్థలను కాదని, ఒక్కసారిగా ఏఐని పెద్ద సంస్థలు వినియోగించబోవు. ఆంత్రోపిక్ వంటి కంపెనీలు మూలధన సమీకరణ కోసమే తెలివిగా ఏఐని వినియోగిస్తున్నాయి. ఆ కంపెనీ గురువారం 30 బి. డాలర్లు సమీకరించింది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని కొన్ని ఐటీ కంపెనీలు చెబుతున్నాయి. కొన్ని ఉద్యోగాలు పోయినా.. మరిన్ని ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. అయినా మార్పేమీ వారు చెబుతున్నంత వేగంగా జరిగిపోదు. మరికొంత మందేమో న్యాయవాదులు, వైద్యుల స్థానాన్ని సైతం ఏఐ భర్తీ చేయగలదని చెబుతున్నారు. ఏఐపై ఒకలాంటి హైప్‌ను వీరు సృష్టిస్తున్నారు. అయితే ఏఐ ఒక విప్లవమని ఒప్పుకోక తప్పదు. ఉత్పాదకతను కచ్చితంగా ఏఐ పెంచుతుంది.

ప్రస్తుత వ్యవస్థలు మారిపోవు: ప్రపంచంలోని పెద్ద కంపెనీలు తమ 'లెగసీ సిస్టమ్స్'పైనే నడుస్తున్నాయి. చాలా వరకు అంతర్జాతీయ బ్యాంకులు వాటిపై ఏటా 15 బి. డాలర్ల (సుమారు రూ.1.36 లక్షల కోట్ల) వరకు ఖర్చు చేస్తున్నాయి. 1213 డేటా బేస్‌లు వాటికి ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో లెగసీ కోడ్‌పై ఏఐ ప్రభావం ఉండదు. ఈ నేపథ్యంలో క్లాడ్ వచ్చి, మొత్తం ఎంటర్‌ప్రైజ్ సిస్టమ్‌ను నిర్వహిస్తుందనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది.

రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!

వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది.

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 201920లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

వెనెజువెలా ముడిచమురు గ్రేడ్‌లు, ముఖ్యంగా ఒరినోకో ప్రాంతం నుంచి వచ్చేవి సంక్లిష్టంగా, భారీగా ఉంటాయి. వీటిని సమర్థంగా ప్రాసెస్ చేసే సామర్థ్యాలు జామ్‌నగర్ రిఫైనరీలో ఉన్నాయి. రవాణా ఇబ్బందుల కారణంగా వెనెజువెలా చమురు కొంత రాయితీ ధరలకే లభిస్తోంది. దీనిని డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మార్చొచ్చు. రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్‌లు పెరగడానికి ఇది దోహదం చేయనుంది.

పసిడి బాండులో రూ.3,449 పెట్టుబడిపై రూ.12,192 లాభం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతంలో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టిన పెట్టుబడులపై మదుపర్లు భారీగా ప్రతిఫలాన్ని పొందుతున్నారు. తాజాగా 2019 ఆగస్టు 4న జారీ చేసిన 201920 సిరీస్3 సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)కు తుది రిడెమ్షన్ ధరను, యూనిట్‌కు రూ.15,641గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.3,449 చొప్పున ఈ బాండ్లలో పెట్టుబడి పెడితే, ఇప్పుడు గ్రాముకు రూ.12,192 లాభాన్ని (353.49%) మదుపర్లు పొందనున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. ఈనెల 10 నుంచి 12 వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా, బాండ్‌కు తుది రిడెమ్షన్ ధరను నిర్ణయించారు.

లీడ్ బ్యాంక్ పథకానికి కొత్త రూపు

నిబంధనల సవరణకు ఆర్‌బీఐ ప్రతిపాదనలు

ముంబయి: జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం కొన్ని నిబంధనలను సవరిస్తూ, శుక్రవారం ముసాయిదాను విడుదల చేసింది. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు, ఇతర అభివృద్ధి సంస్థలను సమన్వయం చేస్తూ, ప్రాధాన్య రంగాలకు రుణ మంజూరును పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. తాజా ప్రతిపాదనల ప్రకారం.. పథకం లక్ష్యాలు, నిర్మాణం, సభ్యత్వం, వివిధ వేదికల అజెండా, కీలక అధికారుల బాధ్యతలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్యాలయాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక వాణిజ్య బ్యాంకును లీడ్ బ్యాంక్‌గా ఆర్‌బీఐ నియమిస్తుంది. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల కార్యకలాపాలను ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ బ్యాంకులు సమన్వయం చేస్తాయి. రుణాల మంజూరులో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చిస్తూ, బ్యాంకులకు అవసరమైన సహకారాన్ని అందిస్తాయి. ముఖ్యంగా రోడ్లు, డిజిటల్ కనెక్టివిటీ, శాంతిభద్రతలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహిస్తూ, ప్రతి ప్రాంతానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలి. రుణ ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయి నుంచి పరిశీలించాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

నెఫ్రోకేర్ లాభం రూ.34.4 కోట్లు

హైదరాబాద్: డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ (నెఫ్రోప్లస్), ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.259.7 కోట్ల ఆదాయంపై రూ.34.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.197.3 కోట్లు, నికర లాభం రూ.20.1 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఈసారి ఆదాయం 31.7%, నికర లాభం 71.3% పెరిగాయి. ఏప్రిల్‌డిసెంబరుకు ఆదాయం రూ.733.2 కోట్లు, నికర లాభం రూ.85.9 కోట్లుగా ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధుల భారాన్ని రోగులకు తగ్గించడమే తమ లక్ష్యమని సంస్థ ఛైర్మన్ విక్రమ్ పుప్పాల తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరిస్తామని పేర్కొన్నారు.

nephroplus

ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్ 8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు.ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్‌సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.

కుల్దీప్ లేకుండా భారత్ మ్యాచ్ గెలవలేదు

టీమిండియా లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్

ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో, రెండు దేశాల అనుభవజ్ఞులు తమ తమ జట్లపై సలహాలు ఇవ్వడం ప్రారంభించారు. పాకిస్థాన్‌తో జరిగే హైవోల్టేజ్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ కోసం టీమిండియా తన ప్లేయింగ్ ఎలెవెన్‌లో కీలక మార్పు చేయాలని సునీల్ గవాస్కర్ సూచించారు. స్పిన్‌కు అనుకూలమైన కొలంబో పిచ్‌పై భారత్ గెలవాలంటే, అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో ఈ పవర్ ఫుల్ స్పిన్నర్‌ను ఖచ్చితంగా జట్టులోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, లెజెండరీ వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ భారత జట్టు యాజమాన్యానికి ఒక ప్రధాన సూచన చేశారు. ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రస్తుతం ఫామ్‌లో లేడని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. నమీబియాతో జరిగిన చివరి మ్యాచ్‌ను వివరిస్తూ, నమీబియా బ్యాట్స్‌మెన్స్ అర్ష్‌దీప్‌ను ఓడించిన విధానం, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి ఓవర్లు కూడా బౌలింగ్ చేయించలేకపోయాడని, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని స్థానంలో స్పిన్నర్‌ను ఆడించాలని ఇది సూచిస్తుందని అన్నారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే బౌలింగ్ చేస్తున్నప్పుడు అర్ష్‌దీప్ తన నాలుగు ఓవర్లు పూర్తి చేయలేదని సునీల్ గవాస్కర్ తెలిపారు. కెప్టెన్‌కి అతనిపై ఉన్న నమ్మకం సన్నగిల్లిందని స్పష్టంగా తెలుస్తుంది. పాకిస్థాన్ లాంటి బలమైన జట్టుతో పోటీ పడేటప్పుడు, ఒత్తిడిలో పరుగులు లీక్ చేసే బౌలర్‌తో మీరు రిస్క్ తీసుకోలేరంటూ ఎత్తిచూపాడు. గవాస్కర్ ప్రకటన సాధారణమైనది కాదు, ఎందుకంటే అతను తరచుగా జట్టు ప్రదర్శనను నిశితంగా పర్యవేక్షిస్తుంటాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లు ఎల్లప్పుడూ ఒత్తిడితో కూడిన ఆట అని, శ్రీలంక పిచ్‌లు, ముఖ్యంగా కొలంబోను స్పిన్నర్లకు స్వర్గధామంగా భావిస్తారని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కుల్దీప్ యాదవ్ మణికట్టు స్పిన్ పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్‌ను నాశనం చేసే అవకాశం ఉందని గవాస్కర్ నొక్కి చెప్పాడు.భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో ఆడినప్పుడల్లా వారు విజయం సాధించారని చరిత్ర చూపిస్తుందని ఆయన అన్నారు. కుల్దీప్ యాదవ్ మ్యాచ్ విన్నర్ అని, అతను లేకుండా పాకిస్థాన్‌ను ఓడించడం కష్టమని ఆయన అన్నారు. హార్దిక్ పాండ్యా మొదటి ఓవర్ వేయడం చూస్తే, పాకిస్తాన్ మ్యాచ్ కోసం అర్ష్‌దీప్ స్థానంలో జట్టు యాజమాన్యం ఇప్పటికే ఎవరిని ఎంపిక చేస్తుందో అర్థం అవుతుందని గవాస్కర్ అన్నారు. జట్టులో కుల్దీప్ ఉండటం బౌలింగ్ కు వైవిధ్యాన్ని జోడించడమే కాకుండా వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ లతో కలిసి పాకిస్తాన్ ఆటగాళ్లను ట్రాప్ చేయగలడు. దీనిని పాకిస్తాన్ బ్యాటర్స్ అధిగమించడం కష్టమని నిరూపించవచ్చు. కుల్దీప్ ను మాత్రమే కాకుండా వరుణ్ చక్రవర్తిని కూడా సునీల్ గవాస్కర్ ప్రశంసించారు. వరుణ్ తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసినప్పటికీ, అతని వికెట్ తీసే సామర్థ్యం స్పష్టంగా కనిపించిందని ఆయన అన్నారు. వరుణ్, కుల్దీప్ కలిసి బౌలింగ్ చేస్తే పాకిస్తాన్ బ్యాటింగ్ కుప్పకూలిపోతుందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా బౌలింగ్ చేసి వికెట్లు తీసిన అక్షర్ పటేల్ ప్రదర్శనను కూడా ఆయన ప్రశంసించారు. ఇంతలో, టీం ఇండియాకు మరో శుభవార్త ఏమిటంటే, ఓపెనర్ అభిషేక్ శర్మ కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగే ఎంపికకు అందుబాటులో ఉంటాడు. వరుణ్ చక్రవర్తి స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ XIలో చేర్చడం అత్యంత వివేకవంతమైన నిర్ణయం అని సునీల్ గవాస్కర్ తేల్చిచెప్పారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ గవాస్కర్ సలహాను ఎలా పాటిస్తారో చూడాలి.

టోర్నీలో బోణీ కొట్టిన ఐర్లాండ్?

ఒమన్? పై 96 పరుగుల తేడాతో విక్టరీ

టీ20 వరల్డ్? కప్? లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్? బ్యాక్ ఇచ్చింది. శనివారం ఒమన్? తో జరిగిన మ్యాచ్? లో ఏకంగా 96 పరుగుల తేడాతో నెగ్గి టోర్నీలో బోణీ కొట్టింది. ఐర్లాండ్? నిర్దేశించిన 236 పరుగుల లక్ష్య ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగుకే కుప్పకూలింది. ఆమిర్ ఖలీమ్ (50 పరుగులు), హమ్మద్ మీర్జా (46 పరుగులు) ఇద్దరే రాణించారు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జోషువా లిటిల్ 3, బ్యారీ మెక్?, మ్యాథ్యూ హంపీర్? చెరో 2, జార్జ్ డాక్రెల్ 1 వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. లోర్కన్ టక్కర్ (94 పరుగులు; 51 బంతుల్లో; 10ఇ4, 4ఇ6), డిలానీ (56 పరుగులు; 30 బంతుల్లో; 3ఇ4, 4ఇ6), జార్జ్ డాక్రెల్ (35 పరుగులు, 9 బంతుల్లోనే, 5 సిక్స్? లు) రాణించడంతో భారీ స్కోర్ దక్కింది. ఈ వరల్డ్? కప్ ఎడిషన్? లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3, షా ఫైసల్, ఆమిర్ ఖలీమ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఇన్నింగ్స్? తో రాణించిన లోర్కన్? కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ' అవార్డు దక్కింది. ఇక టీ20ల్లో పరుగుల పరంగా ఐర్లాండ్? కు ఇది మూడో అత్యధిక మార్జిన్ విజయం. 2023లో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్? లో ఐర్లాండ్? ఏకంగా 128 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20 హిస్టరీలో ఆ జట్టుకు బిగ్గెస్ట్ మార్జిన్? తో విజయం సాధించిన మ్యాచ్ ఇదే. దీని తర్వాత 2017లో స్కాట్లాండ్? తో 98 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇది రెండో అత్యధికం. అలాగే ఈ మ్యాచ్? లో ఇంకో అరుదైన ఘటన నమోదైంది. ఇరుజట్లలోని ఎడమచేతి వాటం బౌలర్లు ఈ మ్యాచ్? లో 11 వికెట్లు పడగొట్టారు. ఒక టీ20 వరల్డ్? కప్? మ్యాచ్? లో ఎడమచేతి వాటం బౌలర్లు అత్యధిక వికెట్లు పడగొట్టిన మ్యాచ్? ఇదే. బంగ్లాదేశ్ ఙ ఒమన్ మ్యాచ్? తో ఈ మ్యాచ్? నిలిచింది. అది 2021 వరల్డ్? కప్? లో జరిగింది.

ఐర్లాండ్ తుది జట్టు : రాస్ అడైర్, టిమ్ టెక్టర్, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్ (కెప్టెన్, వికెట్ కీపర్), కర్టిస్ కాంఫర్, జార్జ్ డాక్రెల్, గారెత్ డెలానీ, మార్క్ అడైర్, బారీ మెక్కార్తీ, మాథ్యూ హంఫ్రీస్, జాషువా లిటిల్

ఒమన్ తుది జట్టు : అమీర్ కలీం, జతీందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మీర్జా, ఆశిష్ ఒడెదర, మహ్మద్ నదీమ్, జితేన్ రామానంది, వినాయక్ శుక్లా (వికెట్ కీపర్), నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మహ్మద్, షా ఫైజల్, షకీల్ అహ్మద్.

పాకిస్తాన్ తో కీలక మ్యాచ్ కోసం టీమిండియా కసరత్తు

సమాలోచనలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నలుగురు కీలక ప్లేయర్లను బరిలోకి దిగే చాన్స్ నేడు కొలంబోలో పాక్ తో ఇండియా మ్యాచ్

2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగే కీలక పోరుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించాడు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఒకేసారి నలుగురు మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్లను రంగంలోకి దింపేందుకు సిద్ధమయ్యాడు. అంటే, ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో కోచ్ గౌతమ్ గంభీర్ తన స్పిన్ అస్త్రాలను పాకిస్థాన్ జట్టుపై ప్రయోగించేందుకు సిద్ధమయ్యాడు. భారత స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్ గా ఉన్నాడు. జట్టులో చేరాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సుందర్‌కు ఆడే అవకాశం రాలేదు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ ఈ యువ స్పిన్ ఆల్ రౌండర్‌ను పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో నేరుగా బరిలోకి దించవచ్చని భావిస్తున్నారు. సుందర్ తన బౌలింగ్ తోనే కాదు, బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ షాట్లు కూడా కొట్టగలడు. ఇది మ్యాచ్‌లో కీలకం అవుతుంది.2026 టీ20 ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వలేదు. అయితే, కుల్దీప్ యాదవ్ ఆర్. ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్‌పై ఆడే ఛాన్స్ ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో కుల్దీప్ 8 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో 6.58 ఎకానమీ రేటును కూడా కొనసాగించాడు. అందుకే కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌ను ఎలాగైనా ఆడించాలని కోరుకుంటాడు. గతంలో పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన ఆర్. ప్రేమదాస పిచ్‌పై కుల్దీప్ యాదవ్ భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడవచ్చు. భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ పాత్ర పాకిస్తాన్ పై చాలా ముఖ్యమైనది కానుంది. ఎందుకంటే, అక్షర్ తన ఎడమ చేతి వేలు స్పిన్ తో పాకిస్తాన్‌ను ఇబ్బంది పెట్టడమే కాకుండా, బ్యాట్ తో భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం కూడా కలిగి ఉన్నాడు.

దమ్ముంటే అభిషేక్ శర్మను ఆడించండి

సూర్యకు పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా సవాల్!

టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా జరగనున్న భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఓ ఆసక్తికరమైన సవాల్ విసిరారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ గత నమీబియా మ్యాచ్‌కు ముందు కడుపులో నొప్పి కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. అయితే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాత్రం అభిషేక్ కోలుకోవాలని, అతను భారత్ తుది జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. "అభిషేక్ శర్మ రేపటి మ్యాచ్ ఆడాలని నేను కోరుకుంటున్నాను. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మేము అత్యుత్తమ ఆటగాళ్లతోనే పోటీ పడాలనుకుంటున్నాము" అని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మీడియా సమావేశంలో పేర్కొన్నాడు.గత ఆసియా కప్‌లో పహల్గాం దాడికి నిరసనగా భారత జట్టు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇది అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై స్పందిస్తూ సల్మాన్ ఆఘా.. "రేపటి మ్యాచ్‌లో క్రీడా స్ఫూర్తి కనిపిస్తుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించాడు. అయితే మరి పాక్ జట్టు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందా? అని అడగ్గా.. "అది రేపు తెలుస్తుంది" అంటూ దాటవేశాడు.పాక్ బౌలర్ ఉస్మాన్ తారిఖ్ విభిన్నమైన బౌలింగ్ యాక్షన్ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. అతని బౌలింగ్ యాక్షన్ అక్రమమని వార్తలు వస్తున్న నేపథ్యంలో పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా అతనికి మద్దతుగా నిలిచాడు. "అతని యాక్షన్ ఇప్పటికే రెండుసార్లు క్లియర్ అయ్యింది. మీడియా అనవసరంగా హైప్ చేస్తోంది. యాక్షన్ క్లియర్ అయినప్పుడు ఇక చర్చ ఎందుకు?" అని సల్మాన్ ప్రశ్నించాడు. ఉస్మాన్ తారిఖ్ తన వింత యాక్షన్‌తో భారత బ్యాటర్లను ఇబ్బంది పెడతాడని భావిస్తున్నారు.

అభిషేక్ శర్మ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్



పాకిస్థాన్‌తో జరగబోయే కీలక సమరానికి ముందు టీమిండియాకు భారీ ఊరట లభించింది. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన, ప్రస్తుతం జట్టుతో కలిసి కొలంబోలో ప్రాక్టీస్‌కు సిద్ధమవుతున్నారు. నంబర్ 1 టీ20 బ్యాటర్‌గా ఉన్న అభిషేక్ రాకతో భారత బ్యాటింగ్ లైనప్‌కు మళ్లీ పూర్వవైభవం వచ్చినట్లయింది. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ, ఆ తర్వాత తీవ్రమైన కడుపు సంబంధిత ఇన్ఫెక్షన్ కారణంగా నమీబియాతో జరిగిన రెండో మ్యాచ్‌కు దూరమయ్యారు. పరిస్థితి విషమించడంతో ఆయనను ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. ఆ సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అభిషేక్ కోలుకోవడానికి మరికొంత సమయం పడుతుందని చెప్పారు. కానీ, అద్భుతమైన రికవరీతో అభిషేక్ ఇప్పుడు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టబోతున్నారు.

వరుణ్ చక్రవర్తి వర్సెస్ పాకిస్థాన్.. : భారత జట్టు టీ20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ విజయాల లక్ష్యంతో శ్రీలంకలో అడుగుపెట్టింది. ఆదివారం పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌లో అందరి కళ్లు వరుణ్ చక్రవర్తిపైనే ఉన్నాయి. ప్రస్తుతం ఐసీసీ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ 1 స్థానంలో ఉన్న వరుణ్, గత ఏడాది ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేయడంలో కీలక పాత్ర పోషించి ఈ స్థానాన్ని దక్కించుకున్నాడు. అయితే, 2021లో పాక్‌తో జరిగిన ఒక చేదు జ్ఞాపకం అతడిని ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. 2021 టీ20 ప్రపంచకప్‌లో వరుణ్ చక్రవర్తి తన అరంగేట్రం మ్యాచ్‌ను పాకిస్థాన్‌పైనే ఆడాడు. అప్పట్లో అతడు కేవలం 3 అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవంతో బరిలోకి దిగాడు.

ప్రియురాలికి హార్దిక్ పాండ్యా మరిచిపోలేని జ్ఞాపకం

ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది.హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు.

రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ

ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట' సిరీస్, 'సైంధవ' వంటి ఇంటెన్స్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

అట్లీ అల్లు అర్జున్ మూవీ సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీల్రో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ` అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

లోకేశ్ కకనగరాజ్ హీరోగా డిసి

'ఖైదీ', 'విక్రమ', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ' . ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.

ధనుష్‌కు లీగల్ నోటీసులు

కోలీవుడ్ నటుడు ధనుష్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. తమిళ నిర్మాణసంస్థ తేనాండాళ్ ఫిల్మ్స్‌తో ధనుష్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. కమిట్‌మెంట్ పూర్తి చేయకపోవడం వల్ల సినిమా ఆలస్యమవుతోందని.. రూ.20 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని లీగల్ నోటీసులు పంపింది. ప్రస్తుతం ఈ విషయం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. "2016లో ఈ నిర్మాణ సంస్థపై 'నాన్ రుద్రన్' సినిమా చేయడానికి ఆయన ఒప్పందం కుదుర్చుకున్నారు. తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించాలని భావించారు. తర్వాత దర్శకుడు మారడంతో ధనుష్ వారికి స్క్రిప్ట్ పూర్తిగా ఇవ్వలేదని నిర్మాణ సంస్థ ఆరోపణలు చేస్తోంది. దీని కారణంగా షూటింగ్ ఆలస్యం అవుతోందని దీంతో రూ.20కోట్లు నష్టం వచ్చిందని సంస్థ తెలిపింది.

ఏప్రిల్ 1న మ పెళ్లి నిజమే

సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీయా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓపైవేట్ ఈవెంట్‌లో ధనుష్,మృణాళ్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాళ్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాళ్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాళ్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాళ్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాళ్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాళ్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాళ్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154